




# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 270 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | ఆదివారం 21 జూన్ 2026 | పేజీలు : 12 | వెల : 2/-


### రాయవరంలో వైద్యం పేరిట 'గారడీ'..

# పైసల కోసం ప్రాణాలతో చెలగాటం




- స్వల్ప ఛాతి నొప్పి అని వెళ్తే..
- 'గుండెల్లో మూడు బ్లాకులు' అంటూ బెంబేలెత్తించిన ప్రైవేట్ ఆసుపత్రి
- స్టంట్ల పేరిట కాకినాడకు తరలించేందుకు హడావిడి..
- కమీషన్ల కోసమేనని బాధితుల ఆరోపణ
- మరో ఆసుపత్రిలో పరీక్షించగా 'నార్మల్'..
- నకిలీ వైద్యుల ముసుగులో తనిఖీలకు స్థానికుల డిమాండ్




**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :**
వైద్యో నారాయణో హరి అన్నారు పెద్దలు... కానీ డాక్టర్ల ముసుగులో ఉన్న కొందరు ప్రైవేట్ కేటుగాళ్లకు మాత్రం రోగి ప్రాణం కంటే.. వారి జేబులో పైసలే ముఖ్యం అన్నట్టుగా తయారైంది పరిస్థితి. పవిత్రమైన వైద్య వృత్తిని వ్యాపారంగా మార్చేసి, కమీషన్ల కక్కుర్తి కోసం సామాన్య ప్రజలను నరకయాతనకు గురిచేస్తున్న ఒక ప్రైవేట్ ఆసుపత్రి నిర్వాకం మండల కేంద్రమైన రాయవరంలో కలకలం రేపింది. ఎలాంటి వైద్య నిర్ధారణలు లేకుండానే, కేవలం భయపెట్టి లక్షలు గుంజాలనే కుట్ర బట్టబయలైంది.

**స్వల్ప నొప్పికే.. పెద్ద స్కెచ్!**

బాధితులు తెలిపిన వివరాల మేరకు శనివారం ఉదయం ఛాతి భాగంలో స్వల్ప నొప్పిగా అనిపించడంతో ఓ వ్యక్తి మిగతా .. 2లో..

# ప్రకృతి సేద్యమే రైతుకు రక్ష

**రసాయనాల వాడకంతో పండించిన పంటలకు ప్రపంచ దేశాల తిరస్కరణ**
**పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.3,125 కోట్ల సాయం విడుదల**
**త్వరలో ప్రతీ రైతు ఇంటికీ ప్రజాప్రతినిధులు వస్తారని సీఎం చంద్రబాబు ప్రకటన**



**పల్నాడు, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రకృతి సేద్యంతోనే రైతులకు, భూమికి నిజమైన ప్రయోజనం చేకూరుతుందని, ఇది భవిష్యత్తు తరాలకు మనం ఇచ్చే ఆరోగ్యకరమైన బహుమతి అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. మితిమీరిన రసాయన ఎరువులు, పురుగుమందుల వాడకం వల్ల కన్నతల్లి లాంటి భూమి విషతుల్యంగా మారుతోందని, ఇది ప్రజారోగ్యానికి పెనుముప్పుగా పరిణమిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయంగా మన ఉత్పత్తుల నాణ్యతపై ప్రభావం చూపుతోందని, అందుకే ప్రకృతి వ్యవసాయాన్ని ఒక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన పిలుపు నిచ్చారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గం లింగంగుంట్ల గ్రామంలో నిర్వహించిన పీఎం కిసాన్-అన్నదాత సుఖీభవ, స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పురుగుమందుల అవశేషాలు ఉండటమనే కారణంతో ఇటీవల గుంటూరు నుంచి పంపిన మూడు మిర్చి కంటైనర్లను చైనా దేశం తిప్పి పంపిన విషయాన్ని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మిగతా .. 2లో..

### క్రిమినల్స్‌కు కులం లేదు..

# వైసీపీ గూండాలను తొక్కి నార తీస్తా



**వైసీపీ రౌడీ మూకలు, గుండాల పిచ్చి వేషాలు తమ వద్ద చెల్లవని తీవ్ర హెచ్చరిక**
**శాంతిభద్రతల విషయంలో పోలీసుల విధుల్లో జోక్యం చేసుకోనని హామీ**
**తప్పుడు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ఉపేక్షించవద్దని అధికారులకు సూచన**
**నేరాలకు వ్యతిరేకంగా పౌరులు ఏకమై పోరాడాలని పిలుపునిచ్చిన డిప్యూటీ సీఎం**

**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్య మని, నేరస్తులకు కులం, మతం, ప్రాంతం వంటివి అంటగట్టి వెనకేసుకొచ్చే సంస్కృతికి చరమగీతం పాడతామని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. నేరాలకు పాల్పడింది తన పార్టీ నాయకులైనా సరే ఉపేక్షించేది లేదని, పోలీసుల విధుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోనని హామీ ఇచ్చారు. కాకినాడలో జరిగిన 'మన ఊరు - మాట మంతి' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, క్రిమినల్స్‌ను ప్రోత్సహించారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ముఖ్యంగా వైసీపీకి చెందిన రౌడీ మూకలను, గుండాలను తొక్కి నార తీస్తాను అంటూ తీవ్ర పదజాలంతో హెచ్చరించారు.

**వైసీపీ గుండాలకు బహిరంగ హెచ్చరిక**

"రక్తపాతం సృష్టిస్తాం, కుత్తుకలు కోస్తాం అని విర్రవీగుతున్న ప్రతి వైసీపీ గుండాకు కెమెరా సాక్షిగా మిగతా .. 2లో..

# బెంగాల్ సంకెళ్లు వీడాయి : మోడీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** తృణమూల్ కాంగ్రెస్, ప్రతిపక్ష పార్టీలపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వాల హయాంలో బందీగా ఉన్న బెంగాల్ సంకెళ్ల నుంచి విముక్తి పొందిందని అన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి సీఎం సువేందు అధికారి నేతృత్వం లోని ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బెంగాల్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో రక్తపాతాన్ని, ప్రాణ నష్టాన్ని చవిచూసినప్పటికీ బెంగాల్ తన అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని కోల్పోలేదని ప్రధాని పేర్కొన్నారు. దేశ విభజన సమయంలో మిగతా .. 2లో..

# విదేశాల్లోనూ 'లేపాక్షి' ఏర్పాటు

**నేతన్నలు, హస్త కళాకారులు గౌరవప్రద జీవనమే లక్ష్యం**
**రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర వ్యాప్తంగా నేతన్నలు, హస్త కళా కారులు గౌరవప్రదమైన జీవనం సాగించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, త్వరలో నేతన్న భరోసా పథకానికి శ్రీకారం చట్టనున్నామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. విదేశాల్లో కూడా లేపాక్షి షోరూమ్‌లు ఏర్పాటు చేయనున్నామన్నారు. అమరావతిలోని మిగతా .. 2లో..

# యోగా సాధనతో మానసిక, శారీరక ఆరోగ్యం

**బాబా రామ్ దేవ్ నిర్వహించిన యోగసాధన కార్యక్రమాన్ని తిలకించిన ముఖ్యమంత్రి**
**చంద్రబాబు యోగి.. కర్మ యోగి అంటూ బాబా రామ్‌దేవ్ కితాబు**



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** మన సంస్కృతి, విలువలే భారతదేశాన్ని ప్రపంచానికి విశ్వగురు స్థానంలో నిలిపాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న సంస్కృతి, విలువలను కాపాడుకుని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి మీద ఉందని సూచించారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉండవల్లి గుహల వద్ద బాబా రామ్ దేవ్ నిర్వహించిన యోగా సాధన మిగతా .. 2లో..

### ప్రైవేటు బస్సులో

# 2.750 కిలోల బంగారం చోరీ



**నంద్యాల, విశ్వం వాయిస్ న్యూస్ :** నంద్యాల జిల్లా డోన్ జాతీయ రహదారిలో ఉన్న ఓ దాబా వద్ద ప్రైవేటు బస్సులో చోరీ జరిగింది. హైదరాబాద్ వైపు వెళుతున్న ప్రైవేటు బస్సులో ప్రయాణిస్తుండగా తన వద్ద నుంచి సుమారు 2.750 కిలోల బంగారం మాయమైందని బాధితుడు మోతీలాల్ తెలిపారు. బస్సు జడ్చర్ల దాటిన తర్వాత బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించిన బాధితుడు.. శనివారం మధ్యాహ్నం డోన్ పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో దాబా వద్ద బస్సు ఆగినప్పుడు చోరీ జరిగిందని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### 'అశ్వినీ వైష్ణవ్‌తో

# సమావేశం ఏర్పాటు చేయండి'

**కిషన్‌రెడ్డికి తెలంగాణా సీఎం రేవంత్ లేఖ**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** మెట్రో రైలు పెండింగ్ అంశాల పరిష్కారానికి జోక్యం చేసుకోవాలని కోరుతూ కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఐఆర్ఎఫ్‌సీ ఫైనాన్సింగ్, మెట్రో ఫేజ్-2 అంశాలపై చర్చించాలన్నారు. ఈ నెల 22, 23వ తేదీల్లో తాను దిల్లీలో ఉంటానని.. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. "మెట్రో రైలు మిగతా .. 2లో..

# తండ్రికి అంత్యక్రియలు నిర్వహించిన కుమార్తెలు



**కె.జగన్నాథపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** అయినవిల్లి మండలం కె.జగన్నాథపురం గ్రామానికి చెందిన పిచ్చిక సత్యనారాయణ (52) శుక్రవారం తీవ్ర అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలే అంత్యక్రియలు నిర్వహించారు. క్యాటరింగ్ పని చేస్తూ జీవించే సత్యనారాయణకు మతి స్థిమితం లేని భార్య సత్యవతి ఉంది. మానసిక దివ్యాంగురాలైన సత్యవతికి సరైన వైద్యం మిగతా .. 2లో..

# ముద్రగడ పద్మనాభంకు అస్వస్థత

**కొన్ని రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ముద్రగడ**
**ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందన్న వైద్యులు**



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవమున్న సీనియర్ నాయకుడు, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం ఆయన హైద రాబాద్‌లోని ఒక ప్రముఖ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలియడంతో ఇరు రాష్ట్రాల్లోని ఆయన అభిమానులు మిగతా .. 2లో..

విశ్వం వాయిస్
ఆదివారం, 21 జూన్ 2026
www.viswamvoice.com

(మొదటిపేజీ తరువాయి)

### రాయవరంలో వైద్యం పేరిట 'గారడీ'..

# పైసల కోసం ప్రాణాలతో చెలగాటం!

స్థానికంగా ఉన్న సదరు ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స కోసం వెళ్లారు. సాధారణ పరీక్షలు చేసి మందులు ఇవ్వాల్సింది పోయి, అక్కడ ఉన్న సిబ్బంది అతనికి పెద్ద 'కార్డియాక్' స్కెచ్ వేశారు. అనుభవం లేని సిబ్బందితో వైద్య పరీక్షలు నిర్వహించి ఎలాంటి సరైన మెడికల్ రిపోర్టులు, ఆధారాలు లేకుండానే.. "మీ గుండెల్లో మూడు బ్లాకులు ఉన్నాయి" అంటూ బాధితుడికి, అతని కుటుంబ సభ్యులకు చెప్పి తీవ్ర ఆందోళనకు గురి చేశారు.

**కమీషన్ల వేటలో కనికరం లేదా !**

ఇంతటితో ఆగని ఆసుపత్రి యాజమాన్యం.. ఇది అత్యవసర కేసు అని, వెంటనే స్టంట్లు వేయించకపోతే ప్రాణాలకే ప్రమాదమంటూ హడావుడి సృష్టించింది. తాము ముందే కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రితో మాట్లాడామని, ఆలస్యం చేయకుండా వెంటనే అక్కడికి తరలించాలని, చిన్నపాటి పరీక్షల అనంతరం అక్కడ వైద్యం ప్రారంభిస్తారని ఒత్తిడి తెచ్చారు. ఆసుపత్రి సిబ్బంది వ్యవహరించిన తీరు, చూపిన అతి ఉత్సాహంపై బాధితులకు తీవ్ర అనుమానం కలిగించింది

**అసలు నిజం తేల్చిన మరో ఆసుపత్రి..**

ప్రాణ భయంతోనే అలర్ట్ అయిన బాధితులు.. సదరు ఆసుపత్రి మాటలపై నమ్మకం కుదరక, ధైర్యం చేసి మరో కార్పొరేట్ ఆసుపత్రిని ఆశ్రయించారు. అక్కడ వైద్యులు అన్ని రకాల నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా.. అసలు నిజం బయటపడింది. సదరు వ్యక్తికి గుండె సంబంధిత సమస్యలేమీ లేవని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారని వైద్యులు తేల్చి చెప్పారు. దీంతో బాధితులు ఊపిరి పీల్చుకున్నప్పటికీ, రాయవరం ఆసుపత్రి చేసిన మోసానికి నివ్వెరపోయారు.

**సర్టిఫికెట్లు కొనేసి.. నకిలీ ముసుగులో వైద్యం!**

అనుభవం లేని సిబ్బందిని నియమించుకుని, కనీస వైద్య ప్రమాణాలు పాటించకుండా ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న ఈ ప్రైవేట్ ఆసుపత్రిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డబ్బుల కోసం సర్టిఫికెట్లను కొనుగోలు చేసి, కొందరు డాక్టర్ల ముసుగులో నకిలీ వైద్యం సాగిస్తున్నారనే బలమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పెద్ద ఆసుపత్రుల నుండి వచ్చే కమీషన్ల కోసమే రోగులను ఇలా బకరాను చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

**అధికారులు తనిఖీలు చేపట్టాలి: స్థానికుల డిమాండ్**

ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన పవిత్ర వైద్య రంగంలో ఇలాంటి అక్రమ దందా సాగడం దురదృష్టకరమని రాయవరం వాసులు మండిపడుతున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న సదరు ప్రైవేట్ ఆసుపత్రిపై వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు తక్షణమే నిఘా ఉంచి, తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# ప్రకృతి సేద్యమే రైతుకు రక్ష

గుర్తుచేశారు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు ఇలాంటి ఉత్పత్తులను తిరస్కరిస్తున్నాయని, ఇది రాష్ట్ర రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తోందని అన్నారు. ఉమ్మడి గుంటూరు నుంచి వాణిజ్య పంటలు, రాయలసీమ నుంచి ఉద్యాన ఉత్పత్తులు, ఉభయగోదావరి జిల్లాల నుంచి ఆక్వా ఉత్పత్తులు పెద్ద ఎత్తున విదేశాలకు ఎగుమతి అవుతున్నాయని, వీటికి మంచి ధర లభించాలంటే నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందేనని సూచించారు. శాస్త్రవేత్తల సూచనల మేరకే ఎరువులు, మందులు వాడాలని, భూసారాన్ని కాపాడుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఇప్పటికే 20 లక్షల ఎకరాల్లో రైతులు ప్రకృతి సేద్యం చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని, దీనికి గుర్తింపుగా స్విట్జర్లాండ్ నుంచి 'ప్లానెట్ ఫుడ్ ప్రైజ్' కూడా లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న పీఎం కిసాన్ పథకం కార్యక్రమాన్ని రైతులతో కలిసి సీఎం వర్చువల్‌గా వీక్షించారు. అనంతరం అన్నదాత సుఖీభవ పథకం తొలి విడత నిధులను విడుదల చేశారు. రాష్ట్రంలోని 46.86 లక్షల మంది రైతులకు రూ.3,125 కోట్ల చెక్కును అందించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం రైతులకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తోందని, అందులో భాగంగా తొలి విడతగా రూ.7 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేశామని తెలిపారు. గత ప్రభుత్వం హామీ ఇచ్చి రైతులను మోసం చేసిందని, తాము చెప్పిన మాట నిలబెట్టుకున్నామని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసి బకాయిలు పెట్టిన గత పాలకులలా కాకుండా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే చెల్లింపులు చేస్తోందని చంద్రబాబు వివరించారు. విత్తన సరఫరా నుంచి మార్కెటింగ్ వరకు ప్రతి దశలోనూ రైతుకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పశ్చిమాసియా యుద్ధం, ఇతర కారణాలతో రైతులు నష్టపోకుండా చూస్తామన్నారు. ఆక్వా రైతుల కోసం ఫీడ్ ధరను తగ్గించామని, తోతాపురి మామిడి, బర్లీ పొగాకు రైతులను ఆదుకున్నామని గుర్తుచేశారు. త్వరలోనే ప్రజాప్రతినిధులు ప్రతి రైతు ఇంటికీ వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని, పంట మార్పిడిపై అవగాహన కల్పిస్తారని ప్రకటించారు. 2027 ఏప్రిల్ నాటికి పోలవరం పూర్తి చేసి, రాష్ట్ర సాగునీటి కష్టాలు తీరుస్తామని పునరుద్ఘాటించారు. రాష్ట్రంలో గొడ్డలి పార్టీకి విద్వేషాలు, విధ్వంసాలు తప్ప అభివృద్ధి తెలీదని ముఖ్యమంత్రి ఆరోపించారు. ప్రతీ అంశంలోనూ విష ప్రచారమే ఆ పార్టీ అజెండా అని అన్నారు. విషం చిమ్మడం, అభివృద్ధిని ఆపటం, ప్రజల్ని ఇబ్బంది పెట్టటం తప్ప ఆ పార్టీకి మరేమీ తెలీదన్నారు. రాష్ట్రాన్ని పరిశుభ్రంగా మార్చేందుకు స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు సీఎం తెలిపారు. ఇందులో భాగంగా కడప, కర్నూలులో రూ.330 కోట్ల వ్యయంతో 15 మెగావాట్ల సామర్థ్యం ఉన్న 'వేస్ట్ టూ ఎనర్జీ' ప్లాంట్లకు శంకుస్థాపన చేశారు. రాష్ట్రంలో 31 శాతంగా ఉన్న పచ్చదనాన్ని 50 శాతానికి పెంచుతామన్నారు. గత ప్రభుత్వ పాలనపై 7 శ్వేతపత్రాలు విడుదల చేశామని, త్వరలోనే కూటమి రెండేళ్ల పాలనపై ప్రోగ్రెస్ రిపోర్టును కూడా ప్రజల ముందు ఉంచుతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఏర్పాటు చేసిన వ్యవసాయ, ఉద్యాన స్టాళ్లను సీఎం పరిశీలించారు.

# వైసీపీ గూండాలను తొక్కి నార తీస్తా

చెబుతున్నా.. మీ పిచ్చి వేషాలు మా దగ్గర చెల్లవు. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి. ప్రజల చేతిలో నిర్ణయం ఉంటుంది. ఒకవేళ మీ ప్రభుత్వమే వచ్చినా సరే, మిమ్మల్ని తొక్కి నార తీస్తాను, గుర్తుపెట్టుకోండి. గతంలో వైసీపీకి పనిచేశామని ఇప్పటికీ విధేయత చూపిస్తున్న కొందరు అధికారులపై ప్రత్యేక దృష్టి పెడతాను" అని పవన్ తీవ్రంగా హెచ్చరించారు. "దేశాన్ని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలనే లక్ష్యంతో రాజకీయాల్లోకి వచ్చాను. పదవుల కోసం కాదు. కాకినాడలో ఛార్జ్ తీసుకున్న తర్వాత ఎవరు ఎస్పీగా, కలెక్టర్‌గా రావాలో నేను నిర్ణయించలేదు. వ్యవస్థలను బలోపేతం చేయండి, నా నుంచి ఒక్క ఫోన్ కాల్ కూడా రాదని వారికి చెప్పాను. నా పార్టీ వాళ్లను పట్టించుకోవద్దని చెప్పాను. ఎమ్మెల్సీ తన డ్రైవర్‌ను చంపేస్తే జైలుకు వెళ్లి అభినందించే వ్యక్తిని నేను కాదు. తెలిసి తెలియని వయసులో 23 నేరాలు చేసిన వాళ్ని కూడా పసిపిల్లవాడని వెనకేసుకొచ్చే నాయకుడిని కాదు" అని పవన్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి నేరపూరిత భావజాలాన్ని ప్రోత్సహిస్తే భవిష్యత్తు ఊహకు అందకుండా తయారవుతుందని ప్రజలను హెచ్చరించారు.

**శాంతిభద్రతల పునరుద్ధరణే లక్ష్యం**

శాంతిభద్రతలు పటిష్టంగా ఉంటేనే పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగాలు వస్తాయని, సమాజం సవ్యంగా ముందుకు సాగుతుందని పవన్ కళ్యాణ్ అన్నారు. "లా అండ్ ఆర్డర్ అనేది కేవలం ప్రభుత్వ విధి మాత్రమే కాదు, నాగరిక సమాజానికి అది పునాది. అది లేకపోతే సంక్షేమం, ఉద్యోగాలు, వ్యాపారాలు అన్నీ కుప్పకూలిపోతాయి. రూల్ ఆఫ్ లాను బలంగా నిలబెట్టాల్సిన బాధ్యత అధికారులదే. ఏ విషయంలోనైనా ఒత్తిడి తీసుకువచ్చేలా నా నుంచి ఒక్క ఫోన్ కాల్ కూడా రాదు" అని ఎస్పీ, కలెక్టర్లను ఉద్దేశించి అన్నారు.

**క్రిమినల్‌కు కులం రంగు పులమొద్దు**

కొందరు నేరస్తులకు కులం రంగు పులిమి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని, ఇది రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత ప్రమాదకరమని పవన్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఆంధ్రప్రదేశ్‌కు పట్టిన కులం దరిద్రం వదిలితే తప్ప రాష్ట్రం బాగుపడదు. క్రిమినల్‌కు కులం ఉండదు. అత్యాచారం చేసేవాడికి, దోపిడీ చేసే నీచుడికి కులం ఎందుకు ఉంటుంది? అలాంటి వారిని వెనకేసుకొస్తే అది ఆ వ్యక్తి నైజాన్ని తెలుపుతుంది. ఎమ్మెల్సీ అనంతబాబు ఒక దళిత డ్రైవర్‌ను హత్య చేస్తే, అది కాపులందరికీ చెడ్డపేరు అవుతుందా? ప్రతిదానికీ కులాన్ని లాగడం సరికాదు" అని ఆయన ప్రశ్నించారు. సుగాలి ప్రీతి, వివేకానంద రెడ్డి హత్య కేసుల్లో గత ప్రభుత్వం సాక్ష్యాలను నాశనం చేయడం వల్లే నేరస్తులకు శిక్ష పడటం కష్టమవుతోందని అన్నారు.

**తప్పుడు ఎస్సీ, ఎస్టీ కేసులపై కఠినంగా ఉండాలి**

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్నారని పవన్ విమర్శించారు. "నిజమైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను ఎంత బలంగా ఎదుర్కొంటామో, తప్పుడు కేసులను కూడా అంతే బలంగా నిలువరించాలి. బాబాసాహెబ్ అంబేద్కర్ మీద గౌరవం ఉన్నవారెవరూ తప్పుడు కేసులు పెట్టరు. సుప్రీంకోర్టు కూడా దీనిపై స్పందించిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మా కూటమి నాయకులు కూడా ఇలాంటి వాటిని ప్రోత్సహించవద్దు" అని విజ్ఞప్తి చేశారు.

**పౌర సమాజం మేల్కొనాలి**

ప్రజలు కూడా తమ బాధ్యతను గుర్తించాలని, తమ ప్రాంతాల్లో జరిగే అన్యాయాలపై గొంతెత్తాలని పవన్ పిలుపునిచ్చారు. "కుల సంఘాలకు వాట్సాప్ గ్రూపులు ఉన్నప్పుడు, శాంతిభద్రతల కోసం ఎందుకు లేవు? మీ వీధిలో 30-40 మంది కలిసి ఒక గ్రూప్‌గా ఏర్పడండి. సిటిజన్ కౌన్సిల్స్ ఏర్పాటు చేసుకోండి. మీరు బలంగా నిలబడితే, ఏ క్రిమినల్ కూడా తలెత్తడానికి భయపడతాడు. జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా లా అండ్ ఆర్డర్ సమస్యలపై ఎక్కడికక్కడ గొంతెత్తాలి. నన్ను కులానికి పరిమితం చేయొద్దు" అని చేతులెత్తి నమస్కరిస్తూ కోరారు. వ్యవస్థాగత వైఫల్యం వల్లే ఒక ఎస్పై పరిష్కరించాల్సిన సమస్య డిప్యూటీ సీఎం వద్దకు వస్తోందని, ఇలాంటి పరిస్థితులను మార్చడానికే తాను కట్టుబడి ఉన్నానని పవన్ కల్యాణ్ పునరుద్ఘాటించారు.

# బెంగాల్ సంకెళ్లు వీడాయి : మోడీ

రాష్ట్రాన్ని భారత్ నుంచి విడదీయడానికి కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రయోజనాలను విస్మరించినందుకు ప్రజలు కాంగ్రెస్‌కు, టీఎంసీకి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ఒకే ఒక్క ఎన్నికల తీర్పు తెచ్చిన మార్పు రాష్ట్రవ్యాప్తంగా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు వెంబడి కంచె ఏర్పాటుకు టీఎంసీ ప్రభుత్వం భూమిని కేటాయించలేదని ప్రధాని దుయ్యబట్టారు. ఓటుబ్యాంకు కోసం చొరబాటుదారులను రాష్ట్రంలోకి మమత అనుమతించారని ఆరోపించారు. ఈ సమస్యను పరిష్కరించడానికి అధికారంలోకి వచ్చిన వెంటనే సరిహద్దుల్లో కంచె ఏర్పాటుకు భాజపా ప్రభుత్వం భూమిని కేటాయించిందన్నారు.

# 'అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయండి'

హైదరాబాద్‌కు, రాష్ట్రానికీ అత్యంత కీలకమైన మౌలిక వసతుల ప్రాజెక్టు. పెండింగ్ అంశాలపై త్వరితగతిన నిర్ణయం తీసుకోవడం అవసరం. రైల్వే మంత్రితో భేటీ ఏర్పాటు చేస్తే.. అవసరమైన పత్రాలు తీసుకొస్తాను. సమావేశం ఏర్పాటు చేసి వివరాలు తెలపాలి" అని లేఖలో పేర్కొన్నారు.

# తండ్రికి అంత్యక్రియలు నిర్వహించిన కుమార్తెలు

అందక మతి స్తిమితాన్ని కోల్పోయింది. ఏడాది క్రితం సత్యనారాయణకు పక్ష వాతం వచ్చి పని చెయ్యలేని పరిస్థితి వచ్చింది.దాంతో ఆ కుటుంబ భారం పెద్ద కుమార్తె అయిన ప్రసన్నపై పడింది.ఆ యువతి ముమ్మిడివరం లోని ఐస్ క్రీమ్ పార్లర్ లో పని చేస్తుంది.ఇక మిగిలిన ఇద్దరు కుమార్తెలు కవలలు.కవలలు అయిన జ్యోతిక,జ్యోత్స్న లు ప్రస్తుతం అదే గ్రామంలో పదో తరగతి చదువుతున్నారు.వీరికి అమ్మ ఉన్నా లేనట్టే.ఇప్పటి వరకూ మంచానికే పరిమితం అయిన తండ్రి శివైక్యం చెందారు.ఇప్పుడు ఆ కుటుంబం పరిస్థితి ఏమిటి.వారిని ఆదుకునేది ఎవరు. అంత కష్టంలోను తండ్రికి ఆ ఆడ బిడ్డలే అంత్య క్రియలు నిర్వహించారు.అందరూ అయ్యో అనే వారే.కానీ ఆ ఆడ బిడ్డలకు మేము ఉన్నాం అని భరోసా ఇచ్చే నాయకులు ఎవరు.అధికారులు ఎవరు.వారిని ఆడుకోలేని జీవితం ఎవరిదైనా వృధానే.అడగకుండా బాకీ ఉన్నట్టు దేవుని హుండీలో సొమ్ములు,బంగారు ఆభరణాలు వేసేది ఎందరో.కానీ ఏ ఆధారం లేని ఆ ఆడ బిడ్డలను దేవుళ్ల లాంటి మీవంటి మానవతా మూర్తులు ఆడుకోకుంటే ఎవరు ఆడుకుంటారు. మీరు ఆపన్న హస్తం అందించినా అందించక పోయినా మీకు చేతనైతే ఆడ బిడ్డలు చదువుకుంటున్నందున ఈ పోస్టును విద్యాశాఖా మంత్రి లోకేష్ గారి దృష్టికి తీసుకు వెళ్లేలా ఫార్వర్డ్ చేయండి

# ముద్రగడ పద్మనాభంకు అస్వస్థత

ఆందోళనకు గురయ్యారు. గత కొన్ని రోజులుగా ముద్రగడ పద్మనాభం కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఈ క్రమంలోనే ఆరోగ్య సమస్యలు కాస్త ఎక్కువవడంతో కుటుంబ సభ్యులు ఆయనను హైదరాబాద్ తీసుకొచ్చి ఆసుపత్రిలో జాయిన్ చేశారు. గత రెండు రోజు లుగా వైద్యులు ఆయనకు డయాలసిస్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి పూర్తిగా నిలకడగానే ఉందని, ఆందోళన చెందాల్సిన పనిలేదని చికిత్స అందిస్తున్న డాక్టర్ల టీమ్ అధికారికంగా వెల్లడించింది. ముద్రగడ అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న వైసీపీ అధినేత జగన్... ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఫోన్ ద్వారా ఆరా తీశారు. ముద్రగడ కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పిన జగన్... ఆయన అత్యంత త్వరగా, సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. మరోవైపు, ముద్రగడ ఆసుపత్రిలో చేరారనే వార్త బయటకు రాగానే సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు షురూ అయ్యాయి. దీంతో ఆయన ఆరోగ్యంపై కాపు శ్రేణుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో, ముద్రగడ కుటుంబ సభ్యులు వెంటనే స్పందిస్తూ ఆందోళనలకు చెక్ పెట్టారు. "ఆయన క్షేమంగా ఉన్నారు. కేవలం రెగ్యులర్ కిడ్నీ ట్రీట్‌మెంట్‌లో భాగంగానే ఆసుపత్రికి తీసుకొచ్చాం. దయచేసి ఇంటర్నెట్‌లో వచ్చే ఎలాంటి అవాస్తవాలను, తప్పుడు ప్రచారాలను ఎవరూ నమ్మవద్దు" అని విజ్ఞప్తి చేశారు.

# విదేశాల్లోనూ 'లేపాక్షి' ఏర్పాటు

శాఖమూరులో పది ఎకరాల విస్తీర్ణంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) ఏర్పాటుకు నిర్ణయించామన్నారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి ద్వారా యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల ప్రగతిపై శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. ఆనాడు అన్న ఎన్టీఆర్ కూడు, గూడు, గుడ్డ నినాదంతో, చేనేత వస్త్రాలకు ప్రాచుర్యం కల్పించారన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబు నేతన్నల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తున్నారు. మంత్రి సవిత తెలిపారు. తరవాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో అన్ని రంగాల మాదిరిగానే చేనేత రంగానికి తీవ్రనష్టం కలిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో, నేతన్నలు ఊపిరిపీల్చుకోగలిగారని మంత్రి సవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి సీఈవో సింహాచలం, కమిషనర్ రేఖారాణి, లేపాక్షి ఎండీ విశ్వ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# యోగా సాధనతో మానసిక, శారీరక ఆరోగ్యం

కార్యక్రమానికి ముఖ్యమంత్రి హాజరయ్యారు. యోగాంధ్ర లోగో ఉన్న చొక్కాను ధరించి ముఖ్యమంత్రి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. బాబా రామ్ దేవ్ నేతృత్వంలో జరిగిన యోగభ్యాసాన్ని ముఖ్యమంత్రి తిలకించారు. ఈ సందర్భంగా వివిధ రకాల యోగాసనాలను సీఎం చంద్రబాబుకు రామ్ దేవ్ వివరించారు. సీఎం చంద్రబాబు ఎదుట చక్రాసనం, వృశ్చికాసనం, మయూరాసనం, హనుమానాసనం, రాజ్ కపోతాసనం, పవర్ యోగా వంటి ఆసనాలను రామ్ దేవ్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."బాబా రామ్ దేవ్‌తో నాకు 30 ఏళ్ల నుంచి పరిచయం ఉంది. రామ్ దేవ్ బాబా యోగాను ప్రజల్లోకి తీసుకెళ్లారు. వేలాది మంది స్వచ్ఛంధంగా వచ్చి రామ్ దేవ్ బాబా దగ్గర యోగాలో శిక్షణ తీసుకుంటారు. యోగాను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లిన రామ్ దేవ్ బాబాకు దేశ ప్రజల తరపున కృతజ్ఞతలు. నేను 30 ఏళ్ల నుంచి టెక్నాలజీని ప్రమోట్ చేస్తున్నాను... రామ్ దేవ్ బాబా యోగాను ప్రమోట్ చేస్తున్నారు. ఇక్కడి అరటి, మామిడి పండ్లు చాలా రుచిగా ఉన్నాయి. ప్రకృతి వ్యవసాయాన్ని సీఎం చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారు. సీఎం చంద్రబాబు ప్రకృతి ప్రేమికుడు, సాంస్కృతిక ప్రేమికుడు, యోగ ప్రేమికుడు సర్వజన ప్రేమికుడు. చంద్రబాబు యోగి, కర్మయోగి."అని రామ్ దేవ్ బాబా అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ మెట్రో రెండో దశ
## ప్రగతి పరుగులా? రాజకీయ చదరంగమా?

హైదరాబాద్ మహానగర ప్రజా రవాణా వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన మెట్రో రైలు, ఇవాళ కేవలం నగర అభివృద్ధి చిహ్నంగా మాత్రమే కాకుండా రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత వేడెక్కిన రాజకీయ చర్చనీయాంశంగా మారింది. నాగోల్ నుంచి రాయదుర్గం వరకు నిత్యం లక్షలాది మంది ప్రయాణికులతో పరుగులు తీస్తున్న మెట్రో రైళ్లు నగర జీవనాన్ని ఎంతగానో సులభతరం చేశాయి. కానీ, నగరం నలువైపులా విస్తరించాల్సిన రెండో దశ మాత్రం ఏళ్ల తరబడి కాగితాలకే పరిమితమైపోయింది. ఈ ఆలస్యం వెనుక ఉన్న అసలు కారణాలు ఏమిటి? రాష్ట్ర ప్రభుత్వానికీ కేంద్రానికీ మధ్య ఎందుకు పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటోంది? ఈ అంశాన్ని లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**మెట్రో విస్తరణ సమస్య ఏమిటి?:**

హైదరాబాద్ మెట్రో మొదటి దశను ఎల్ అండ్ టీ (రాడు) సంస్థ నిర్మించి, నిర్వహించింది. అయితే ఆ సంస్థకు ఈ భారీ ప్రాజెక్టు కాలక్రమేణా ఆర్థికంగా పెద్ద భారంగా మారింది. ఈ నేపథ్యంలో, రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పూర్తిగా తన ఆధీనంలోకి తీసుకునే ప్రక్రియను ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. భారతీయ రిజర్వ్ బ్యాంకు హామీతో ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ నుంచి సుమారు 13,600 కోట్ల రూపాయల రుణాన్ని కేవలం 4 శాతం తక్కువ వడ్డీకే, 20 ఏళ్ల సుదీర్ఘ కాలపరిమితితో సమీకరించారు. దాదాపు 30,000 కోట్ల రూపాయల విలువైన ఈ ప్రాజెక్టును సగం ధరకే రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి తీసుకువచ్చినట్టు అధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. మే నెల మొదటి తేదీ నుంచే మెట్రో ఫేజ్-1 పూర్తిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చింది.అయితే, అసలు సమస్య ఇక్కడే మొదలవుతుంది. ఈ టేకోవర్ ప్రక్రియ పూర్తయితేనే రెండో దశ విస్తరణకు మార్గం సుగమం అవుతుందని అందరూ భావించారు. నాగోల్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 76 కిలోమీటర్లకు పైగా, మొత్తం 122 కిలోమీటర్ల కొత్త కారిడార్లతో రూపొందించిన రెండో దశ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదికకు కేంద్ర ప్రభుత్వం నుంచి ఇప్పటివరకూ తుది ఆమోదం లభించలేదు. రాష్ట్ర ప్రభుత్వం దీనికోసం 19,579 కోట్ల రూపాయలతో పరిపాలనా అనుమతి ఇచ్చినప్పటికీ, కేంద్రం తన వాటాగా ఇవ్వాల్సిన నిధులు, పూచీకత్తు, రుణ సమీకరణకు అవసరమైన సహకారం ఇంకా కార్యరూపం దాల్చలేదు. ఈ జాప్యం వల్ల ప్రాజెక్టు అంచనా వ్యయం రాబోయే రోజుల్లో మరింత పెరిగే ప్రమాదం ఉందని మౌలిక సదుపాయాల నిపుణులు హెచ్చరిస్తున్నారు. మొదటి దశలో అత్యధిక డిమాండ్ ఉన్న పలు కీలక మార్గాలకు మెట్రో కనెక్టివిటీ లేకపోవడం, నగర శివారు ప్రాంతాలు మెట్రో పరిధికి దూరంగా ఉండటం వంటి లోపాలను సామాన్య ప్రజలు ఇప్పటికీ ఎదుర్కొంటూనే ఉన్నారు.

**రేవంత్ సర్కారు, కేంద్రం మధ్య పేచీ ఏమిటి?:**

మెట్రో రెండో దశ నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం పదే పదే కేంద్రాన్ని కోరుతున్నా ఆశించిన స్పందన రాకపోవడంతో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై తీవ్ర ఆరోపణలకు దిగారు. జపాన్ నుంచి ఐఆర్ఎఫ్‌సీ ఖాతాలోకి వచ్చిన నిధులను తెలంగాణకు అందకుండా కిషన్ రెడ్డి అడ్డుకుంటున్నారని, రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ కక్షసాధింపే ఆయన ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోందని సీఎం బహిరంగంగా విమర్శించారు. తెలంగాణ నుంచి కేంద్ర మంత్రివర్గంలో ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యక్తికి రాష్ట్ర ప్రయోజనాలపై బాధ్యత ఉండాలని, కానీ కిషన్ రెడ్డి అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని ఆయన నిలదీశారు. తాము అన్ని ఆర్థిక ఏర్పాట్లు పూర్తి చేసి, డాక్యుమెంట్ ఫీజు చెల్లించి, ఈక్విటీ కింద నిధులు జమ చేసినా కేంద్రం నుంచి తుది అనుమతి రాకపోవడం వెనుక ఉద్దేశపూర్వక జాప్యమే కారణమని ఆరోపించారు.దీనికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అంతే ఘాటుగా బదులిచ్చారు. తాను రుణాన్ని అడ్డుకోవాల్సిన అవసరం ఏముందని ఎదురుప్రశ్నించిన ఆయన, దేశంలోని అన్ని రాష్ట్రాలకు వర్తించే నిబంధనలే తెలంగాణకూ వర్తిస్తాయని, కొన్ని సాంకేతిక అంశాలపై అధ్యయనం కొనసాగుతోందని వివరణ ఇచ్చారు. మెట్రో రెండో దశకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50 శాతం చొప్పున నిధులు సమకూర్చే ప్రతిపాదనకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్టు ఆయన పేర్కొన్నారు. డీపీఆర్, ఇతర సాంకేతిక వివరాలు పూర్తయిన తర్వాతే తుది నిర్ణయం సాధ్యమని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి సైతం స్పష్టం చేశారు. తమపై వివక్ష చూపిస్తున్నారన్న ఆరోపణలను తోసిపుచ్చిన కిషన్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కేంద్రంపై నిందలు మోపడం సరికాదని ఎదురుదాడి చేశారు.

**వేరు వేరుగా ఎవరెవరిపై విమర్శలు?:**

ఈ వివాదం కేవలం రాష్ట్రం వర్సెస్ కేంద్రం మాత్రమే కాదు. ఇందులో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ పార్టీ కూడా భాగమై, వ్యవహారం త్రిముఖ పోరుగా మారింది. మొదటి దశలో అత్యధిక డిమాండ్ ఉన్న మార్గాలకు బదులు లాభదాయకత తక్కువగా ఉన్న మార్గాలను ఎంచుకుని పాత ప్రభుత్వమే ప్రాజెక్టును నష్టాల్లోకి నెట్టిందని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తుండగా, తమ హయాంలో దేశంలోనే అత్యుత్తమ మెట్రో వ్యవస్థల్లో ఒకటిగా హైదరాబాద్ మెట్రోను నిలిపామని బీఆర్ఎస్ నేతలు ప్రతివాదన చేస్తున్నారు. మరోవైపు, కేటీఆర్ కుట్రలకు కిషన్ రెడ్డి వంత పాడుతున్నారని, కేంద్రమంత్రికి అంత చాతుర్యం లేదని కేటీఆర్ ఆడించినట్టు ఆడుతున్నారని సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా మరింత దుమారం రేపాయి. దీనికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సైతం ఘాటుగా స్పందిస్తూ, తనను భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలకు దిగడంతో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది.

**వీటిలో నిజమెంత? :**

ఈ వివాదంలో రెండు పక్షాల వాదనలనూ నిష్పక్షపాతంగా బేరీజు వేసుకుంటే కొన్ని వాస్తవాలు స్పష్టంగా కనిపిస్తాయి. మొదటిది- మెట్రో రెండో దశకు సంబంధించిన డీపీఆర్‌కు కేంద్రం నుంచి తుది ఆమోదం నిజంగానే ఆలస్యమవుతోంది అన్నది వివాదాస్పదం కాని వాస్తవం. ఈ జాప్యానికి కారణం ఏమిటన్న దగ్గరే అభిప్రాయభేదాలు మొదలవుతాయి. మొదటి దశను ప్రైవేటు సంస్థ నిర్వహించడం, రెండో దశను రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టాలని నిర్ణయించడం వల్ల రెండింటి మధ్య సమన్వయ లోపం తలెత్తే అవకాశం ఉందన్న కేంద్రం వాదనలో సాంకేతికంగా కొంత న్యాయం ఉండే అవకాశం ఉంది. మెట్రో వంటి భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు డీపీఆర్ పరిశీలన సాధారణంగా నెలల తరబడి సాగడం దేశవ్యాప్తంగా చూసే అంశమే.అయితే, కేంద్రం ప్రకటించిన యాభై శాతం నిధుల భాగస్వామ్య ప్రతిపాదన కేవలం మౌఖిక హామీగానే మిగిలిపోయి, లిఖితపూర్వక, కార్యాచరణ రూపంలో ముందుకు రాకపోవడం రాష్ట్ర ప్రభుత్వ ఫిర్యాదుకు బలాన్నిస్తుంది. రాజకీయంగా రెండు పార్టీలదీ వేర్వేరు ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు, కేంద్ర-రాష్ట్ర సంబంధాలలో సహజంగా తలెత్తే అపనమ్మకం, జాప్యానికి ఆజ్యం పోస్తుందన్నది మాత్రం కాదనలేని వాస్తవం. తెలంగాణ మాత్రమే కాదు, వేరే రాష్ట్రాల్లో సైతం ప్రతిపక్ష పాలిత ప్రభుత్వాలకు కేంద్ర సహకారం ఆలస్యమైన ఉదంతాలు గతంలో నమోదయ్యాయి. కాబట్టి ఇది తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన వివక్ష అని కచ్చితంగా చెప్పలేకపోయినా, రాజకీయ కారణాలు పూర్తిగా లేవని కొట్టిపారేయడం కూడా సాధ్యం కాదు.మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి చూస్తే ఎల్ అండ్ టీ నుంచి టేకోవర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసి, తక్కువ వడ్డీకి భారీ రుణం సమీకరించగలగడం నిర్వహణ సామర్థ్యానికి నిదర్శనమే అయినప్పటికీ, ఈ విజయాన్ని కేంద్రంపై ఒత్తిడి తెచ్చే రాజకీయ సాధనంగా వాడుకుంటోందన్న విమర్శనూ తోసిపుచ్చలేం. ప్రతి మీడియా సమావేశంలోనూ మెట్రో అంశాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తూ, వ్యక్తిగత విమర్శలకు దిగడం పరిష్కారం కంటే రాజకీయ లబ్ధికే ఎక్కువ ఉపయోగపడుతుందన్న వాదనకూ తావుంది. అదే సమయంలో, ఎన్నికల హామీల అమలులో జాప్యంపై కేంద్రమంత్రి చేసిన ఎదురుదాడి సహేతుకమే అయినా, అది మెట్రో నిధుల ఆలస్యానికి సంబంధించిన ప్రశ్నకు ప్రత్యక్ష సమాధానం కాదు- ఇది అంశాన్ని పక్కదారి పట్టించే ధోరణిగానే కనిపిస్తుంది.మొత్తంగా చూస్తే, ఇరు పక్షాల ఆరోపణల్లోనూ పాక్షిక సత్యం ఉంది తప్ప, ఏ ఒక్క పక్షమూ పూర్తిగా నిర్దోషి కాదు. సాంకేతిక జాప్యం, రాజకీయ వైరం రెండూ కలగలసిపోయి అసలు సమస్యను మరింత జటిలం చేస్తున్నాయి.

**ముందున్న మార్గం:**

చివరిగా చెప్పాలంటే, ఈ రాజకీయ వాగ్యుద్ధంలో అసలు నష్టపోతున్నది మాత్రం ప్రతిరోజూ లక్షలాది మంది మెట్రోపై ఆధారపడే సామాన్య ప్రయాణికులే. ట్రాఫిక్ రద్దీతో సతమతమవుతున్న నగర శివారు ప్రాంతాల ప్రజలు రెండో దశ కోసం ఎదురుచూస్తుండగా, రాజకీయ పార్టీలు పరస్పర నిందారోపణలతో కాలం వెళ్లదీయడం ఆందోళనకరం. డీపీఆర్ ఆమోదం, నిధుల విడుదల వంటి సాంకేతిక ప్రక్రియలను వేగవంతం చేస్తూనే, రాజకీయ విభేదాలను పక్కనపెట్టి అభివృద్ధి అంశాల్లో పరస్పర సహకారం అందించుకోవడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్న ఏకైక మార్గం. లేదంటే, నగర ప్రజల కల అయిన పూర్తిస్థాయి మెట్రో నెట్‌వర్క్ మరికొన్నేళ్లు ఆలస్యమయ్యే ప్రమాదం ఉంది. ఇరు పక్షాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన సమయం ఇది.



డాక్టర్ సూర్యదేవర రామకృష్ణ,
9490754169

# ఎడిటర్ వాయిస్

## షర్మిల అప్సెట్ అయ్యారా?

కాంగ్రెస్‌కి ఏపీలో పెద్దగా ఉనికి లేదు అన్న సంగతి తెలిసిందే. అయితే ఆ పార్టీకి ఏపీ అధ్యక్షురాలిగా షర్మిల ఉండడం వల్లనే ఎంతో కొంత మాట్లాడుకోవాల్సి వస్తోంది అని అంటారు. ఇక షర్మిల పీసీసీ చీఫ్ అయి రెండున్నరేళ్ళ కాలం గడచింది. ఈ కాలంలో ఆమె కాంగ్రెస్ తరఫున పదవిలో ఉండి ఏమి సాధించింది అంటే తన అన్న వైఎస్ జగన్ ని మాజీగా చేయడమే. అది సగం సంతోషమా లేక పూర్తి ఆనందమా తెలియదు కానీ కాంగ్రెస్ మాత్రం ఏ కోశానా ఎత్తిగిల్లలేదు. మరో వైపు చూస్తే షర్మిల ఎంతసేపూ వైసీపీ మీదనే విరుచుకుపడతారు అన్న విమర్శలు కూడా కాంగ్రెస్ గ్రాఫ్ ని ఏ మాత్రం పెంచలేకపోయాయి. బీజేపీ మీద కూడా ఆమె విమర్శలు చేసినా ఏపీలో కూటమి ప్రభుత్వం పట్ల మాత్రం అంతగా రియాక్ట్ అవరు అన్న విమర్శలు ఉన్నాయి.

**ఎందుకీ మౌనం :** ఇదిలా ఉంటే షర్మిల ఇటీవల కాలంలో ఫుల్ సైలెంట్ అయ్యారని అంటున్నారు. ఆమె ఎక్కువగా పర్యటనలు చేయకపోయినా తన ఎక్స్ ఖాతా ద్వారా మాత్రం రియాక్ట్ అవుతూ ఉంటారు. కొన్ని సమస్యల మీద ఆమె ఎక్స్ వేదికగా చేసే ఆరోపణలు కానీ విమర్శలు కానీ కొంత హాట్ టాపిక్ గానే ఉంటూ వచ్చాయి. అలాంటి షర్మిల అయితే ఇపుడు పెద్దగా స్పందించడం లేదు అని అంటున్నారు. అంతే కాదు ఆమె మౌన ముద్రలో ఉన్నారు అని కూడా అంటున్నారు. ఇంతకీ షర్మిల మౌనం దేనికి సంకేతం, ఎందుకు ఇలా అన్న చర్చ వస్తోంది.

**అనుకున్నది జరగలేదనా :** షర్మిల రాజ్యసభ సీటుని ఆశించారు అని చెబుతారు. ఆమెకి సీటు ఖరారు అన్న ప్రచారం కూడా పెద్ద ఎత్తున సాగింది. కర్ణాటక కాంగ్రెస్ కోటాలో ఆమెకి ఈ సీటు ఇస్తారని కూడా అనుకున్నారు. ఇక ఆమె పేరు ప్రకటన తరువాయి అనుకున్న నేపథ్యంలో సడెన్ గా మాయమైది. దాంతోనే ఆమె అప్సెట్ అయ్యారా అన్న చర్చ వస్తోంది. లేకపోతే ఆమె సైలెంట్ గా ఇంతలా ఉన్న దాఖలాలు లేవని అంటున్నారు. క్రిష్ణలంక యువకుడు గాదె సాయి క్రిష్ణ మే 9 నుంచి కనిపించడం లేదని అంటున్నారు. ఇక ఆయనది లాకప్ డెత్ అని కూడా చెబుతున్నారు. దీని మీద అన్ని రాజకీయ పార్టీలు రియాక్ట్ అవుతున్నాయి. ఇక రాజకీయంగా కూడా ఇది అతి పెద్ద రచ్చగా మారింది. కానీ షర్మిల మాత్రం స్పందించకపోవడం మీదనే చర్చ సాగుతోంది.

**జగన్ సైతం వెళ్ళారు :** ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ కూడా సాయి క్రిష్ణ ఇంటికి వెళ్ళి పరామర్శించి వచ్చారు. సీబీఐ విచారణకు డిమాండ్ చేశారు. చంద్రబాబు అయితే తన వద్దకు సాయి క్రిష్ణ తల్లిని పిలిపించుకుని న్యాయం చేస్తామని హామీ కూడా ఇచ్చారు. ఈ విధంగా రాజకీయం అంతా సీరియస్ గా మారిన వేళ ఏపీలో కాంగ్రెస్ పార్టీ అధినేత్రిగా షర్మిల రియాక్ట్ కాకపోవడం మీదనే చర్చ సాగుతోంది. ఆమె ఈ ఇష్యూని ఒక రాజకీయ పార్టీ నేతగా కాకపోయినా ఒక పౌర సమాజంలోని పౌరురాలిగా అయినా రియాక్ట్ కావాలి కదా అన్న వారూ ఉన్నారు. మరి ఆమె ఎందుకు సైలెంట్ అయింది అన్నది మాత్రం ఎవరికీ తెలియడం లేదనే అంటున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## గర్భిణీ చితాభస్మంలో బయటపడ్డ కత్తెర

### వైద్యుల నిర్లక్ష్యానికి తల్లి, బిడ్డ మృతిచెందిన ఘటనలో వెలుగులోకి కీలక అంశాలు



**కొత్తగూడెం, విశ్వం వాయిస్ న్యూస్ :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం శంభూనిగూడెం గ్రామంలో వనజ(20) అనే గర్భిణీకి పురిటి నొప్పులు రావడంతో గుండాల ప్రభుత్వ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తరలించారు. ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో లేకపోవడంతో సాధారణ నర్సు కాన్పు చేశారు. నర్సు అవగాహన రాహిత్యం వల్ల శిశువు అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్ర రక్తస్రావంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన తల్లి. అయితే తల్లీబిడ్డలకు కర్మకాండ నిర్వహించాక, తల్లి చితాభస్మం సేకరిస్తుండగా అందులో శస్త్ర చికిత్సకు వాడే కత్తెర బయటపడడంతో బోరున విలపించిన కుటుంబ సభ్యులు . వైద్యుల నిర్లక్ష్యం వల్లే తల్లి, బిడ్డ ప్రాణాలు కోల్పోయారనేందుకు ఇదే నిదర్శనం అంటూ కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు ఆసుపత్రిలో సాధారణ ప్రసవమే జరిగిందని, కత్తెర ఎలా వచ్చిందో తమకు తెలియదని చెప్తున్న వైద్యాధికారులు.

## నల్గొండలో ఎన్టీఆర్ విగ్రహం దహనం చేసిన నిందితులు అరెస్ట్

**నల్గొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ అభ్యర్థి అశోక్ కుమార్ గౌడ్ మరియు మరో నిందితుడిని అరెస్ట్ చేసి పీడీ యాక్ట్ కింద కేసు పోలీసులు నమోదు చేశారు. జూన్ 6వ తేదీన తెల్లవారుజామున నల్గొండలోని ఎన్టీఆర్ విగ్రహంపై బెడ్ షీట్లు కప్పి, పెట్రోల్ పోసి దహనం చేసిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇండిపెండెంట్ అభ్యర్థి పాలకూరి అశోక్ కుమార్ గౌడ్, ఎలుకంటి ప్రణీత్ అనే నిందితులు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులు బలెనో కారు(టీఎస్ 07 ఎం 2430)లో వచ్చి విగ్రహానికి నిప్పు పెట్టినట్లు గుర్తించి, వారిని అరెస్ట్ చేసి పీడీ యాక్ట్ నమోదు చేసిన పోలీసులు.

## భీమవరంలో నారాయణ స్కూల్ సీజ్



**భీమవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నారాయణ స్కూల్‌ను సీజ్ చేసిన విద్యాశాఖ అధికారులు.. ఎటువంటి అనుమతులు, ఓపెనింగ్ పర్మిషన్ లేకుండానే తరగతులు నిర్వహిస్తుండటంతో అధికారుల చర్యలు.. స్కూల్ భవన నిర్మాణం పూర్తికాకుండానే క్లాసులు నడపడంపై ఎస్ఎఫ్ఐ నాయకుల తీవ్ర నిరసన... నియమ నిబంధనలకు విరుద్ధంగా స్కూల్ ప్రాంగణంలోనే పుస్తకాలు, విద్యాసామాగ్రి విక్రయాలు... మంత్రి నారాయణ పదవి వదిలి స్కూళ్లలో పుస్తకాలు, బ్యాగులు అమ్ముకోవాలంటూ ఎస్ఎఫ్ఐ మండిపాటు... ఎటువంటి పర్మిషన్లు లేకుండా పాఠశాల నడుపుతున్న మాట నిజమేనని అంగీకరించిన డీఈఓ..

## ముగ్గురు అక్కాచెల్లెళ్ల అనుమానాస్పద మృతి

### ఉరేసుకొని తండ్రి ఆత్మహత్య – ప్రకాశం జిల్లా కేవీ అగ్రహారంలో విషాదం





**చీమకుర్తి, విశ్వం వాయిస్ న్యూస్ :** ముగ్గురు అక్కాచెల్లెళ్లు అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా.. వారి తండ్రి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం కె.వి.అగ్రహారంలో కలకలం రేపింది. ఈ విషాద ఘటనలో ఏకుల సుధాకర్(35), అతని ముగ్గురు కుమార్తెలు గోఅచ్యుత(13), పూజ(10), లోహితశ్రీ(9)లు విగత జీవులుగా మారారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సుధాకర్ ఓ గ్రానైట్ క్వారీలో టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఆయన భార్య వెంకటేశ్వరమ్మ మూడు సంవత్సరాలుగా పుట్టింట్లోనే ఉంటోంది. ముగ్గురు కుమార్తెలు, తల్లి సుశీలతో కలిసి సుధాకర్ కేవీ అగ్రహారంలో జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి పిల్లలకు అన్నం పెట్టిన తర్వాత సుధాకర్ తల్లి సుశీల నిద్రించేందుకు సమీపంలో ఉన్న పశువుల కొట్టానికి వెళ్లింది. శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో సుశీల పశువుల కొట్టం వద్ద నుంచి ఇంటికి వచ్చి చూడగా.. పిల్లలు ముగ్గురూ పడుకొన్న మంచం వద్దే సుధాకర్ కూర్చొని ఉన్నాడు. పిల్లలు నిద్ర పోతున్నారని, అప్పుడే లేపొద్దని, తాను చీమకుర్తికి వెళ్లి టిఫిన్ తీసుకుని వస్తానని తల్లితో చెప్పి సుధాకర్ బయటకు వెళ్లాడు. పిల్లలు ఎంత సేపటికీ లేవకపోవడంతో నాన్నమ్మ సుశీల వారిని తట్టి లేపేందుకు ప్రయత్నించింది. వారిలో చలనం లేకపోవడంతో చుట్టుపక్కల వారిని పిలిచింది. పిల్లలు చనిపోయారని చెప్పేందుకు సుధాకర్‌కు ఫోను చేయగా.. అతను ఫోను తీయలేదు. ఇంతలో సమీపంలోని పొలంలో సుధాకర్ చెట్టుకు ఉరివేసుకొని మృతి చెంది ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, చీమకుర్తి సీఐ డి.ప్రసాద్, ఎస్సై సంపత్ కుమార్‌లు సంఘటనా స్థలాన్ని సందర్శించారు. మగ్గురు పిల్లలది అనుమానాస్పద మృతిగా, సుధాకర్‌ది ఆత్మహత్యగా కేసులు నమోదు చేశారు. సుధాకర్ తన ముగ్గురు బిడ్డలకు విషమిచ్చి చంపి, తానూ ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని స్థానికంగా భావిస్తున్నారు.

### పోస్ట్‌మార్టం నివేదికతో

## వాస్తవాలు వెలుగులోకి..

### రాధా గాయత్రి భర్త



**సింహాచలం, విశ్వం వాయిస్ న్యూస్ :** తన భార్య అనుమానాస్పద మృతి కేసులో ఉత్తరాఖండ్ పోలీసుల విచారణకు పూర్తిగా సహకరిస్తున్నట్లు రాధా గాయత్రి భర్త శ్రీచరణ్ తెలిపారు. భార్య మరణానంతర కార్యక్రమాలు నిర్వహించేందుకు సింహాచలానికి వచ్చిన ఆయన మాట్లాడారు. "గాయత్రి మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేశాను. ఆ రోజు రాత్రి మేం వైన్ తాగాం. ఉదయం లేచి చూసే సరికి అంతా జరిగిపోయింది. పోస్ట్‌మార్టం నివేదిక ఆధారంగా వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. అప్పటి వరకు నేనేమీ మాట్లాడలేను" అని అన్నారు. విజయనగరం జిల్లా మామిడిపల్లికి చెందిన రాధా గాయత్రికి గతేడాది నవంబర్‌లో విశాఖకు చెందిన శ్రీచరణ్‌తో వివాహమైంది. ఇద్దరు కలిసి ఇటీవల విహార యాత్రకు వెళ్లగా.. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో ఆమె విగతజీవిగా మారింది. తమ అల్లుడు ముమ్మాటికీ సైకో అని.. అలా ప్రవర్తించే తమ కుమార్తెను బలి తీసుకున్నాడని రాధా గాయత్రి తల్లిదండ్రులు వాపోయారు. నిరంతర వేధింపులు, మానసిక ఒత్తిడి కారణంగా తమ కుమార్తె ప్రాణాలు కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## చిట్టీల పేరుతో రూ.4 కోట్ల మోసం..

### పోలీసుల అదుపులో దంపతులు



**ముత్తుకూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** నెల్లూరు జిల్లాలోని ముత్తుకూరు మండలం కృష్ణపట్నంలో చిట్టీల పేరుతో భారీ మోసం బయటపడింది. చిట్టీల నిర్వాహకులు చల్లా గంగమ్మ, ఏడుకొండలు దంపతులు రూ.4 కోట్ల వరకు వసూలు చేసి మోసానికి పాల్పడినట్లు బాధితులు ఆరోపించారు. దాదాపు 94 మంది బాధితులు ముత్తుకూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో చిట్టీల నిర్వాహకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## ఆలుమగల గొడవకు మూడు ప్రాణాలు బలి

### కన్నబిడ్డలతో రైలు కిందపడి వివాహిత ఆత్మహత్య



**కోటబొమ్మాళి, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీకాకుళం జిల్లా పలాస రైలు నిలయం సమీపంలో ఘోరం జరిగింది. ఇద్దరు కన్నబిడ్డలతో కలిసి తల్లి బలవన్మరణానికి పాల్పడింది. రైల్వే పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... కోటబొమ్మాళి మండలం చలమయ్యపేటకు చెందిన గేదెల వెంకటరావుతో సంతబొమ్మాళి మండలం కొత్తపేటకు చెందిన పూజ(28)కు 2019లో వివాహమైంది. వీరికి కుమారుడు కుశాంత్(7), కుమార్తె దీక్షిత(6) ఉన్నారు. ఉపాధిరీత్యా వెంకటరావు భార్యాపిల్లలతో కలిసి విజయవాడలో నివాసముంటున్నారు. ఇటీవల ఆయన సోదరి భర్త మృతి చెందడంతో పరామర్శకు స్వగ్రామానికి వచ్చారు. వెంకటరావు తల్లి పాపమ్మ వృద్ధురాలు కావడంతో మంచానికే పరిమితమయ్యారు. ఆమెకు సపర్యలు చేసే విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో ఇద్దరు పిల్లలతో కలిసి పూజ గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చేశారు. సాయంత్రం నుంచి పలాస రైలు నిలయం పరిసరాల్లో తిరుగుతూ అర్ధరాత్రి దాటాక పిల్లలతో కలిసి సోంపేటవైపు వెళ్లే రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం జీఆర్పీ పోలీసులు పట్టాలపై మృతదేహాలను గుర్తించి పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేశామని జీఆర్పీ ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు.

## చెత్త నుంచి సంపద సృష్టిద్దాం

### పర్యావరణ పరిరక్షణలో యువత ముందుండాలి : మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి చెత్త నుంచి సంపద సృష్టించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పిలుపునిచ్చారు. రామచంద్రపురం పట్టణంలోని శ్రీ వివేకానంద ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్‌లో మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు అధ్యక్షతన నిర్వహించిన స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. రాష్ట్రాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో నింపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోందని ప్రతి ఇంటికీ ఈ సందేశాన్ని తీసుకెళ్లడంలో విద్యార్థులు బ్రాండ్ అంబాసిడర్లుగా కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తగ్గించడం చెత్తను వర్గీకరించడం ద్వారా చెత్తనే సంపదగా మార్చుకోవచ్చని తెలిపారు. ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ గ్రామాలు – స్వచ్ఛ నగరాల లక్ష్యంతో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని విద్యార్థుల్లో పరిశుభ్రత అలవాట్లు పెంపొందించేందుకు ప్రభుత్వం "ముస్తాబు" కార్యక్రమాన్ని రూపొందించిందని పేర్కొన్నారు. అనంతరం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కమ్మవారి సావరంలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్‌ను మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న సేవలు, పోషకాహారాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్ భారతి, సూపర్‌వైజర్లు నాగమణి, పార్వతి పిల్లలకు ఇస్తున్న పోషకాహారం, తదితర అంశాలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి చిన్నారి పిల్లలతో కొద్దిసేపు ముచ్చటించి వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శ్రీ వివేకానంద ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో జరిగిన సమావేశంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంతరాయ్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, వివేకానంద ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్ కరస్పాండెంట్ బి.ఎ.ఎస్. సరోజిని మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యాలు, విద్యార్థులు తీసుకోవలసిన పరిశుభ్రత జాగ్రత్తలపై వివరించారు. ఈ రెండు కార్యక్రమాల్లో స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, మున్సిపల్ డీఈ శ్రీకాంత్, ఎంఈఓ వాసంశెట్టి నాగేశ్వరి, వివేకానంద ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శైలుష, ప్రిన్సిపాల్ నవీన్ తేజ, కూటమి పార్టీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ

### ఈదరపల్లి అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అమలాపురం రూరల్ మండలం ఈదరపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రం పరిసరాలను, చిన్నారులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం కేంద్రంలోని చిన్నారులతో ఆప్యాయంగా ముచ్చటించిన ఎమ్మెల్యే, ఎలాంటి భేషజాలు లేకుండా వారితో కలిసి నేలపై కూర్చున్నారు. అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు ప్రతిరోజూ అందించే పౌష్టికాహారాన్ని స్వయంగా వారితో కలిసి తిని, దాని నాణ్యతను పరిశీలించారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధి అయినప్పటికీ ఎంతో నిరాడంబరంగా పిల్లలతో కలిసి భోజనం చేయడం స్థానిక తల్లిదండ్రులు, అంగన్వాడీ సిబ్బందిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో పరిశుభ్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, పిల్లలకు నాణ్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని నిరంతరం అందించాలని సిబ్బందికి సూచించారు. రేపటి తరాన్ని ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దడంలో అంగన్వాడీ కేంద్రాల పాత్ర కీలకమని పేర్కొన్న ఆయన, కేంద్రాల మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, అంగన్వాడీ సూపర్వైజర్లు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## అంతరించిపోతున్న ప్రాచీన యుద్ధకళ 'చెడీ'కి నూతన ఊపిరి

### యువతలో ఆసక్తి పెంపొందించిన గురువులకు ఘన సన్మానం



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన ప్రాచీన యుద్ధకళలు క్రమంగా కనుమరుగవుతున్న ప్రస్తుత తరుణంలో, వాటిని సంరక్షించి భావితరాలకు అందించేందుకు కృషి చేస్తున్న గురువులకు స్థానికంగా ఘన సన్మానం నిర్వహించారు. ఇటీవల వేసవి సెలవుల సందర్భంగా చిన్నారులు, యువతకు ప్రాచీన యుద్ధకళ అయిన 'చెడీ'లో శిక్షణ అందించిన వంటెద్దు సత్తిబాబు, వంటెద్దు నాగేశ్వరావులను వంటెద్దువీధిలోని శ్రీ పట్టాభిరామ ఆలయంలో ఘనంగా సత్కరించారు. ప్రస్తుతం ఆధునిక జీవనశైలిలో భాగంగా పిల్లలు ఎక్కువగా సాంకేతిక పరికరాలకే పరిమితమవుతున్న సమయంలో, శారీరక దృఢత్వం, మానసిక ఏకాగ్రత, ఆత్మరక్షణ నైపుణ్యాలను పెంపొందించే సంప్రదాయ యుద్ధకళలపై ఆసక్తి కల్పించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ముఖ్యంగా చెడీ వంటి అరుదైన యుద్ధకళను నేర్చుకోవడానికి నేటి తరం ముందుకు రావడం శుభపరిణామమని అభిప్రాయపడ్డారు. చెడీ విద్య కేవలం యుద్ధ నైపుణ్యమే కాకుండా క్రమశిక్షణ, ధైర్యం, ఆత్మవిశ్వాసం, శారీరక సామర్థ్యాలను పెంపొందించే సమగ్ర విద్య అని వక్తలు వివరించారు. ఈ కళ ద్వారా యువతలో సాహసోపేతమైన ఆలోచనలతో పాటు సంప్రదాయాల పట్ల గౌరవ భావన కూడా పెరుగుతుందని చెప్పారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రాచుర్యంలో ఉన్న ఈ యుద్ధకళ ప్రస్తుతం అంతరించిపోయే పరిస్థితికి చేరుకున్న నేపథ్యంలో, దానిని పునరుద్ధరించేందుకు వంటెద్దు సోదరులు చేస్తున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు. వేసవి శిక్షణా శిబిరాల్లో పాల్గొన్న విద్యార్థులు చెడీ విద్యపై విశేష ఆసక్తి కనబరిచారని, శిక్షణ ద్వారా శారీరక దారుఢ్యం, చురుకుదనం, ఆత్మరక్షణ నైపుణ్యాలు పెరిగాయని నిర్వాహకులు తెలిపారు. భవిష్యత్తులో మరింత మంది విద్యార్థులకు ఈ కళను పరిచయం చేసి, సంప్రదాయ యుద్ధకళలను సజీవంగా ఉంచేందుకు కృషి చేయాలని పలువురు సూచించారు. సన్మాన కార్యక్రమంలో వంటెద్దు స్వామినాయుడు, వంటెద్దు బాబీ, వంటెద్దు వెంకన్నాయుడు, యాళ్ల సతీష్, యాళ్ల జగ్గారావు, యాళ్ల శ్రీను, వంటెద్దు కన్నా, దూలం శ్రీరామమూర్తి, కొమ్ముల రాము, అయ్యల మల్లిబాబు, వంటెద్దు ప్రసాద్, అన్యం సత్తిబాబు, ఎర్రంశెట్టి ప్రసాద్, వాండ్రపు లక్ష్మణరావు, అన్నవరపు ఈశ్వరరావు, నార్ని బుజ్జి తదితరులు పాల్గొని గురువులను అభినందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ఆధునిక విద్యతో పాటు భారతీయ సంప్రదాయ కళలు, యుద్ధకళలను కూడా భావితరాలకు అందించడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. చెడీ వంటి ప్రాచీన విద్యలను ప్రోత్సహించడం ద్వారా యువతలో దేశీయ సంస్కృతి పట్ల అవగాహన పెంపొందడంతో పాటు శారీరక, మానసిక వికాసం సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. సంప్రదాయ వారసత్వాన్ని కాపాడేందుకు ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలని కోరారు.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...




కాకినాడ తూర్పు గోదావరి డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

ఆదివారం, 21 జూన్, 2026




# కొత్తపల్లి గ్రామంలో పశుమాంస దుర్గంధం

**అల్లాడుతున్న విద్యార్థులు, గ్రామస్థులు - పాఠశాల సమీపంలోనే జంతు కబేళ**
**దుర్వాసనతో అశ్వస్థతకు గురవుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు, సమీపం ప్రజలు**
**కాసులకు కక్కుర్తి పడిన పంచాయతీ అధికారులు ఫిర్యాదు చేసినా లెక్క చేయని నిర్వాహకుడు**



**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం కొత్తపల్లి గ్రామంలో నిత్యం విద్యార్థులతో కళకళలాడాల్సిన పాఠశాల ప్రాంగణం దుర్గంధంతో విద్యార్థుల అశ్వస్థతకు కారణంగా నిలుస్తుంది. కొత్తపల్లి గ్రామం మండల ప్రజా పరిషత్ పాఠశాల సమీపంలో ఒక పశుమాంస వ్యాపారి నిత్యం గ్రామంలో చనిపోయిన పశువులను పాఠశాల సమీప ప్రాంతం లో కోస్తూ తర్వాత ఆ మాంసాన్ని ఎండపెడుతూ పాఠశాల ప్రాంతం తో పాటు సమీప ప్రాంత ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడు.అంతే కాకుండా ఈ వ్యాపారస్థునికి సమీపంలోనే రెండు దేవాలయాలు ఉండడంతో దేవాలయానికి వచ్చే భక్తులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు.ఇదే విషయాన్ని పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లితండ్రులు,ఉపాధ్యాయులు పలు మార్లు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. అదే విధంగా స్థానికంగా నివాసముంటున్న గంపల ప్రసాద్ కుటుంబం సైతం పంచాయతీ అధికారులకు పిర్యాదు చేసినప్పటికీ మాంసం వ్యాపారి ఏ మాత్రం లెక్క చెయ్యకుండా సమీపం ప్రాంత ప్రజలతో పాటు విద్యార్థుల ఆరోగ్యం తో చెలగాటమాడుతున్న వ్యాపారిపై ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించి మాంస విక్రయాలను నిర్మూలించడంతో పాటు మృత పశువులను గ్రామం లోకి తీసుకుని రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థుల, మండల ప్రజా పరిషత్ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానికులు తెలిపారు.

రాజమహేంద్రి మహిళా కళాశాల ఆధ్వర్యంలో

# అంతర్జాతీయ యోగా దినోత్సవం

**యోగా నిత్యజీవితంలో ఒక భాగం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక సుబ్రహ్మణ్యం మైదానంలో శనివారం రాజమహేంద్రి మహిళా జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాల ఆధ్వర్యంలో ఘనంగా యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తూర్పుగోదావరి జిల్లా న్యాయమూర్తి ఉమా సునంద ముఖ్య అతిథిగా హాజరై యోగా ప్రాముఖ్యతను వివరించారు. ఆరోగ్యవంతమైన జీవనానికి యోగా ఎంతో అవసరమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ నిత్యం యోగ సాధన చేయడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థి దశ నుంచే యోగా పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని ఆమె అన్నారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో రాజమహేంద్రి మహిళా జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థినులు పాల్గొని వివిధ యోగాసనాలను ప్రదర్శించారు. వారి క్రమశిక్షణ, ఉత్సాహం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యోగాసనాల ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని విద్యార్థినులు చాటిచెప్పారు. కార్యక్రమంలో రాజమహేంద్రి విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ టి.కే. విశ్వేశ్వరరెడ్డి, డైరెక్టర్ తేతలి సత్య సౌందర్య, ప్రిన్సిపాల్ ఎం.కె.ఎస్. ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ రాగు సత్యనారాయణ, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన యోగ పోటీలలో విజేతలుగా నిలిచిన ఎం.మౌనిక, పి.సిరి, టి.దివ్య, ఏ.మాధురి, ఎం.సువర్చలలకు జిల్లా న్యాయమూర్తి ఉమా సునంద చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో యోగా గురువు కె.ఎస్.వి. శ్రీధర్ రెడ్డి, యోగా డెమోనిస్ట్రేటర్లు వెంకట్రావు, ఆశపు అనంతలక్ష్మి, కే.హేమ నిర్మలారెడ్డి, రెడ్డి జ్యోతి, కోణాల భాగ్యలక్ష్మి, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ దంటు వీరవెంకటరావు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. యోగాను నిత్యజీవితంలో భాగంగా చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు.

ఎంపీడీవో కార్యాలయంలో పీఎం కిసాన్ పథకం

# మొదట విడత నిధులు విడుదల కార్యక్రమం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం మొదటి విడత నిధుల విడుదల కార్యక్రమం సందర్భంగా నియోజకవర్గ స్థాయి కార్యక్రమం రాజనగరం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించబడింది. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి, సీతానగరం వారు మాట్లాడుతూ రాజనగరం నియోజకవర్గ పరిధిలోని సీతానగరం మండలానికి అన్నదాత సుఖీభవ పథకం కింద 2026-27 సంవత్సరంకి సంబంధించి మొదటి విడత నగదు 6,848 మంది రైతులకు రూ.342.40 లక్షలు, పీఎం కిసాన్ 23వ విడత కింద 6,039 మంది రైతులకు రూ.120.78 లక్షలు మొత్తంగా రూ.463.18 లక్షల మేర ప్రయోజనం చేకూరినట్లు తెలిపారు.అదే విధంగా మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో (ఆర్ ఎస్ కె ఎస్) అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకానికి సంబంధించిన రాష్ట్రస్థాయి ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని టెలివిజన్ ద్వారా రైతులకు వీక్షించేలా ఏర్పాట్లు చేశారు. రైతులు కార్యక్రమాన్ని వీక్షించి వ్యవసాయ కార్యక్రమాలపై అవగాహన పొందారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు అవ సరమైన మేరకు యూరియా ఎరువుల నిల్వలు అందుబా టులో ఉన్నాయని, రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సి న అవసరం లేదని మండల వ్యవసాయాధికారి తెలిపారు. రైతులు అవసరమైన ఎరువు లను సహకార సంఘాలు మరియు ప్రైవేట్ దుకాణాల ద్వారా పొందవచ్చని చెప్పా రు.అలాగే రైతులు ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా తమ వ్యవసాయ సంబంధిత వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని ప్రభుత్వ సేవలు, పథకాల ప్రయోజనా లను పొందాలని సూచించారు.

# పరిసరాల పరిశుభ్రతే ఆపరేషన్ క్లీన్ స్వీప్ లక్ష్యం

**ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** పరిసరాల పరిశుభ్రతే ఆపరేషన్ క్లీన్ స్వీప్ ప్రధాన లక్ష్యమని అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పేర్కొన్నారు. మండపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్థానిక యూపీ హెచ్ సి ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వేగుళ్ళ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ మండపేట పట్టణాన్ని "స్వచ్ఛ మండపేట"గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. పట్టణ పరిశుభ్రత కోసం ప్రజలందరూ సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఆసుపత్రి ఆవరణాన్ని స్వయంగా శుభ్రం చేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆర్డి మండపేట పుర ప్రత్యేక అధికారి సిహెచ్ నాగ నరసింహారావు, మున్సిపల్ కమీషనర్ టి వి రంగారావు, మెప్మా సి ఎం ఎం సుజాత, ఆర్‌పిలు, స్వర్ణ వార్డు సచివాలయాల సెక్రటరీలు, పారిశుద్ధ్య కార్మికులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నాగంపల్లి నాగారమ్మ జాతరలో పాల్గొన్న జక్కంపూడి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం నాగంపల్లి గ్రామ దేవత నాగరమ్మ జాతర మహోత్సవములో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ జన విభాగం రాష్ట్ర అధ్యక్షులు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వీరి వెంట వైయస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో యోగా, ప్రాణాయామ శిక్షణ కార్యక్రమం

**యోగాతో సంపూర్ణ ఆరోగ్యం**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర డే కార్యక్రమంలో భాగంగా స్థానిక ఇండియన్ రెడ్ క్రాస్ భవనంలో శనివారం తూర్పుగోదావరి జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులకు యోగా, ప్రాణాయామ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ డాక్టర్ కె.వి. రమణ, కోశాధికారి డాక్టర్ జి.మహాలక్ష్మి మాట్లాడుతూ యోగా మనిషి శారీరక, మానసిక ఆరోగ్యాలను పరిరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. నిరంతరం యోగా, ప్రాణాయామం, ధ్యానం, సూర్యనమస్కారాలు చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా జూన్ 21వ తేదీని అత్యధిక పగటి సమయం ఉండే రోజుగా గుర్తించి అంతర్జాతీయ యోగా దినోత్సవంగా జరుపుకుంటున్నారని వివరించారు. యోగాను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ తూర్పుగోదావరి జిల్లా ఎంసీ సభ్యులు బోను రామకృష్ణ, బళ్ళా శ్రీనివాసరావు, నూర్ బేగ్, యోగా శిక్షకులు కర్రి హేమ నిర్మలరెడ్డి, కేబీ లక్ష్మీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ అధ్యాపకులు ఎం.వెంకటరత్నం, రెడ్ క్రాస్ సిబ్బంది గోపీకృష్ణ, పద్మ, భావన కృష్ణ, బి. మధు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని వివిధ యోగాసనాలు, ప్రాణాయామ విధానాలను అభ్యసించారు. యోగాతో ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు.

ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించిన

# ఓటరు నమోదు అధికారి టిఆర్ రాజేశ్వరరావు



**మండపేట మండలం, విశ్వం వాయిస్ న్యూస్ :** మండపేట మండలం ఏడిద గ్రామంలో శనివారం మండపేట అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి టిఆర్ రాజేశ్వర రావు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పనులను పరిశీలించారు.ఓటర్లకు ఎన్యూమరేషన్ ఫారముల పంపిణీ, 2002 వివరాలతో నింపిన ఫారలను పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో సహా సేకరించడం, బి ఎల్ ఓ యాప్‌లో డిజిటలైజేషన్ ప్రక్రియను ఆయన తనిఖీ చేశారు. బూత్ లెవెల్ అధికారులు, సూపర్‌వైజర్లకు దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పి. తేజేశ్వర రావు, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ పి.ఎ.మెహర్ బాబా, బిఎల్ఓలు, సూపర్‌వైజర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, బిఎల్ఏలు పాల్గొన్నారు.అనంతరం మునిసిపల్ కమీషనర్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, బి ఎల్ ఓ లు, సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటలైజేషన్ పనులను వేగవంతం చేసి రోజువారీ లక్ష్యాలు చేరుకోవాలని ఆదేశించారు. సర్ విజయవంతానికి అందరూ సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో మునిసిపల్ కమీషనర్ టి.వి. రంగారావు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ కె. శ్రీ రమ్య తదితరులు పాల్గొన్నారు.

# మునికూడలి ఘాట్‌లో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం ముని కూడలి ఘాట్ నందు జిల్లా గ్రామపంచాయతీ అధికారి వి.శాంతామణి ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎం.భారతి డిప్యూటీ ఎంపీడీవో ఎంవి రెడ్డి, పంచాయతీ సిబ్బంది, స్వర్ణ గ్రామ సిబ్బంది,ప్రజలు పాల్గొన్నారు.

# రైతు శ్రేయస్సు కూటమి ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే వేగుళ్ళ




**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** అన్నదాతలకు పెట్టుబడి భారం తగ్గించి, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ' పథకం నిధులు విడుదల చేశామని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్ మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట ఎంపిడిఓ కార్యాలయంలో మండపేట నియోజకవర్గానికి స్పందించి 2026 ఖరీఫ్ సీజన్ కు గానూ తొలివిడత నిధులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం వ్యవసాయాన్ని నిర్లక్ష్యం చేస్తే తమ కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.ధాన్యం అమ్మిన గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాలో నగదు జమవుతోందన్నారు. కేవలం గంటల వ్యవధిలోనే నగదు జమకావడం పట్ల రైతులు సంతృప్తిగా ఉన్నారన్నారు. వైఎస్సార్సీపీ హయాంలో ధాన్యం అమ్మిన సొమ్ము కోసం నెలల తరబడి వేచి చూసేవాళ్లన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ఎక్కడా దళారుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుల నుంచి కొనుగోళ్లు జరుపుతుండటం ఎంతో హర్షణీయమని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఎంతో పారదర్శకంగా నిర్వహిస్తున్నారన్నారు. కొన్ని గంటల్లోపే డబ్బులు జమ చేసి బ్యాంకు ద్వారా మా ఫోన్లకు మెసేజ్లను పంపుతున్నారన్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ జరుపుతుండటం రైతులకు ఆనందంగా ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభ్యున్నతే లక్ష్యమని పేర్కొన్నారు.రాజకీయ కక్షలు, కుట్రలకు తావులేని స్వచ్ఛమైన, స్వేచ్ఛాయుత పాలన అందిస్తున్నామని స్పష్టం చేశారు. రైతు సుఖీభవ పథకం ద్వారా మండపేట నియోజకవర్గం లో మొత్తం రూ 12.10 కోట్లు జమ చేశామని చెప్పారు. మండపేట మండలం 5,455 మంది రైతులకు అన్నదాత సుఖీభవ మొత్తం రూ 2.73 కోట్లు, ప్రధాన మంత్రి కిసాన్ మొత్తం రూ1.03 కోట్లు మొత్తం రూ 3.76 కోట్లు జమ చేశామని చెప్పారు. కపిలేశ్వరపురం మండలం 7,119 మంది రైతులకు అన్నదాత సుఖీభవ మొత్తం రూ 3.56 కోట్లు, ప్రధానమంత్రి కిసాన్ మొత్తం రూ 1.33కోట్లు మొత్తం 4.89 కోట్లు జమ చేశామని చెప్పారు. రాయవరం మండలం 5,105 మంది రైతులకు అన్నదాత సుఖీభవ మొత్తం రూ2.55 కోట్లు, ప్రధానమంత్రి కిసాన్ మొత్తం రూ 0.91 కోట్లు,మొత్తం రూ 3.46 కోట్లు జమ చేశామని చెప్పారు. ఏ ఎం సి చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, తూర్పుగోదావరి జిల్లా గ్రంధాలయ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి , మండపేట పిఎసిఎస్ చైర్మన్ కుక్కల రామారావు,మండల టిడిపి అధ్యక్షులు కర్రి తాతారావు, అమలాపురం పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి దేవు శ్రీను, తాపేశ్వరం పిఎసిఎస్ అధ్యక్షులు పడాల రామకృష్ణారెడ్డి, సలాది సుబ్రహ్మణ్యం మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి చంద్రశేఖర్ దొరబాబు,అమలాపురం పార్లమెంట్ పార్లమెంట్ టీడీపీ వాణిజ్య విభాగ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు ఎంపీడీఓ సత్యనారాయణ, ఆలమూరు ఏ డి ఏ సిహెచ్ కెవి చౌదరి, మండల వ్యవసాయ అధికారులు కే ప్రభాకర్, బి రవి, కెవిన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు..

# ప్రాణాలతో చెలగాటం వద్దు



**గోకవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తల్లిదండ్రుల గారాబం, నిర్లక్ష్యం కారణంగా మైనర్ల చేతుల్లోకి వాహనాలు చేరుతుం డటంతో ప్రమాదాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు నడిపేందుకు చట్టపరంగా అర్హత లేని బాలబాలికలు ద్విచక్ర వాహనాలను మితిమీరిన వేగంతో నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్న ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. అనేక ప్రమాదాల్లో యువకులు ప్రాణాలు కోల్పోతున్నప్పటికీ, కొందరు తల్లిదండ్రులు తమ పిల్లల కోరికలను కాదనలేక వాహనాలు అందజేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. మైనర్ వయస్సులో వాహనాలు నడపడం వల్ల ఎదురయ్యే చట్టపరమైన చర్యలు, ప్రమాదాల తీవ్రత గురించి పిల్లలకు అవగాహన కల్పించడం తల్లిదండ్రుల బాధ్యత అని వారు అభిప్రాయపడుతున్నారు. అదేవిధంగా, పోలీసులు మరియు రవాణా శాఖ అధికారులు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించి మైనర్లు వాహనాలు నడపకుండా కట్టడి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. పాఠశాలలు, కళాశాలల వద్ద తరచూ వాహనాల తనిఖీలు నిర్వహిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని అంటున్నారు. వాహనాల తనిఖీల సమయంలో డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, బీమా వంటి పత్రాలను పరిశీలించడం ద్వారా చోరీకి గురైన వాహనాలను కూడా గుర్తించే అవకాశం ఉంటుందని ప్రజలు సూచిస్తున్నారు. అధికారులు కఠిన చర్యలు తీసుకుని మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రుల్లో అవగాహన పెంచితే యువత ప్రాణాలను కాపాడటంతో పాటు రోడ్డు ప్రమాదాలను కూడా తగ్గించవచ్చని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు. "మైనర్ల చేతుల్లో వాహనం కాదు... వారి భవిష్యత్తు ఉండాలి" అని పలువురు సామాజిక కార్యకర్తలు పేర్కొన్నారు.



విద్యను వ్యాపారం చేస్తే సహించం..

# స్కూల్ ఫీజుల వివరాలు తప్పనిసరిగా ప్రదర్శించాలి

## మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యను వ్యాపారంగా మార్చే ధోరణిని ప్రభుత్వం ఏమాత్రం సహించదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు. రామచంద్రపురంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు, జిల్లా విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావుతో నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. ఇటీవల ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయంటూ ప్రజల నుంచి, సామాజిక మాధ్యమాల ద్వారా అనేక ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. విద్యాశాఖ నిబంధనల ప్రకారం ప్రతి పాఠశాల ఫీజుల వివరాలను నోటీస్ బోర్డుపై స్పష్టంగా ప్రదర్శించాలని, అలాగే పాఠశాలలో పనిచేసే సిబ్బంది వివరాలు, విద్యార్హతలు కూడా అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం ప్రతి విద్యాసంస్థ బాధ్యత అని గుర్తుచేసిన మంత్రి పాఠశాలల ప్రాంగణంలో యూనిఫాంలు, పుస్తకాలు విక్రయించరాదని స్పష్టం చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా ప్రభుత్వం 'తల్లికి వందనం' పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తోందని, తల్లిదండ్రులపై అదనపు భారం మోపకుండా విద్య అందించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో విద్యారంగంలో అనేక సంస్కరణలు అమలవుతున్నాయని, ప్రభుత్వ పాఠశాలలు నేడు కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చెందాయని మంత్రి పేర్కొన్నారు. అనేక ప్రభుత్వ పాఠశాలల్లో 'నో అడ్మిషన్స్' బోర్డులు కనిపించడం ప్రభుత్వ విద్యపై పెరుగుతున్న విశ్వాసానికి నిదర్శనమని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ జీవో నెం.1 ప్రకారం ప్రైవేట్ పాఠశాలలు అన్ని నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనుమతుల సమయంలో సమర్పించిన ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి సంవత్సరం సానిటరీ సర్టిఫికేట్, స్ట్రక్చరల్ సేఫ్టీ సర్టిఫికేట్, ఫైర్ ఎన్‌ఓసీ, మౌలిక వసతులు, ఫీజుల వసూళ్లకు సంబంధించిన ఆడిట్ నివేదికలను సమర్పించాలని తెలిపారు. అలాగే ఫీజుల వివరాలను నోటీస్ బోర్డులో ప్రదర్శించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ఎక్కడైనా అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే సంబంధిత విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య ప్రతినిధులు స్పందిస్తూ, తాము ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే ఫీజులు వసూలు చేస్తున్నామని, అవసరమైతే విద్యాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించవచ్చని తెలిపారు. సంస్థగతంగా తాము కొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో డీవైఈవో పి.రామలక్ష్మణమూర్తి, ఎంఈవోలు ఎం.శ్రీనివాస్, వాసంశెట్టి నాగేశ్వరి, నాగరాజు, రామచంద్రపురం జోనల్ ప్రైవేట్ స్కూల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు జీవీ రావు, జిల్లా అధ్యక్షులు డి. సత్తిబాబు, గుబ్బల రాంబాబు, బి ఏ ఎస్ సరోజినీ, రాజ్యలక్ష్మి, నియోజకవర్గంలోని ప్రైవేట్ విద్యాసంస్థల కరస్పాండెంట్లు, కూటమి ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను

# ఘనంగా నిర్వహించాలి



**జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోం నిదియాదేవి**

**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలోని జి.ఎం.సి. బాలయోగి స్టేడియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని జిల్లా స్థాయిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఘనంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వైఖోం నైదియాదేవి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించి, అంతర్జాతీయ యోగా దినోత్సవ నిర్వహణ సన్నద్ధతపై దిశానిర్దేశం చేశారు. సుమారు వెయ్యి మందితో ఈ వేడుకలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి, పక్కా ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన 200 మంది, కిమ్స్ విద్యాసంస్థకు చెందిన 200 మంది విద్యార్థులను సమీకరించి ప్రత్యేక ఆకర్షణగా యోగా కార్యక్రమాన్ని నిర్వహించాలని తెలిపారు. అలాగే 100 మంది పోలీసు సిబ్బందిని విధుల్లో నియమించాలని ఆదేశించారు. సుమారు 500 మంది ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనేలా చేసి మొత్తం వెయ్యి మందితో కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. స్టేడియంలో నిర్వహించే ఈ మెగా యోగా ప్రదర్శనలో విద్యార్థులు, యువత, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, యోగా ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని పాల్గొనేవారికి తాగునీరు, మజ్జిగ సౌకర్యాలు కల్పించాలని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతర విద్యుత్ సరఫరా, వైద్య శిబిరం, అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల అధికారులు తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వహించి, ఈ కార్యక్రమం జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చేలా విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డీఆర్ఓ వి. సుబ్బారావు, జిల్లా పౌర సరఫరాల అధికారి అడపా ఉదయభాస్కర్, జిల్లా పర్యాటక అధికారి అన్వర్ హుస్సేన్, జిల్లా ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ శ్యాంసుందర్, జిల్లా మేనేజర్ (పౌర సరఫరాల శాఖ) పి. శ్రీనివాస్, జీఎస్‌డబ్ల్యూఎస్ జిల్లా స్థాయి కోఆర్డినేటర్ సువిజయ్, డీఎల్‌డీఓ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ విద్యార్థికి మంత్రి చేయూత

**ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న మంత్రి వాసంశెట్టి సుభాష్**



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆపదలో ఉన్న ఓ కుటుంబానికి అండగా నిలుస్తూ, ప్రతిభావంతమైన విద్యార్థిని చదువుకు భరోసా కల్పించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖామాత్యులు, ఎస్ఎఎఫ్ వ్యవస్థాపకులు వాసంశెట్టి సుభాష్ మరోసారి తన సేవాభావాన్ని చాటుకున్నారు.కొత్తపేట మండలం పలివెల గ్రామానికి చెందిన చప్పిడి రామకృష్ణ జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. అయితే కొంతకాలం క్రితం జేసీబీలో ఆయిల్ నింపే సమయంలో ప్రమాదవశాత్తు జారిపడటంతో మెడ నరాలు దెబ్బతిని పక్షవాతానికి గురయ్యారు. దీంతో ఆయన మంచానికే పరిమితమై కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది.ఈ నేపథ్యంలో రామకృష్ణకు ఇద్దరు కుమార్తెలు ఉండగా వారి విద్యాభ్యాసాన్ని కొనసాగించడం కుటుంబానికి భారంగా మారిందని స్థానికులు మంత్రి వాసంశెట్టి సుభాష్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై స్పందించిన మంత్రి, రామకృష్ణ పెద్ద కుమార్తె చప్పిడి దేవి ప్రియ పదో తరగతిలో 525 మార్కులు సాధించినప్పటికీ ఆర్థిక పరిస్థితుల కారణంగా ఆమె చదువు మధ్యలో ఆగిపోకూడదనే ఉద్దేశంతో ఇంటర్మీడియట్ విద్యకు అయ్యే పూర్తి ఖర్చును భరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.ఇచ్చిన హామీ మేరకు దేవి ప్రియను కొత్తపేటలోని అక్షర జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేర్పించి, మొదటి సంవత్సరం విద్యా ఫీజును పూర్తిగా చెల్లించారు. దీంతో విద్యార్థిని ఎలాంటి ఆర్థిక భారం లేకుండా తన ఉన్నత విద్యను కొనసాగించే అవకాశం కలిగింది.మంత్రి సుభాష్ తన మాటను నిలబెట్టుకుంటూ అందించిన ఈ సహాయానికి రామకృష్ణ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా నిలిచి, విద్యార్థిని భవిష్యత్తుకు భరోసా కల్పించిన మంత్రి సేవాభావాన్ని స్థానికులు అభినందించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు బొక్కా ప్రసాద్, చప్పిడి సురేష్, చిల్లి కుమార్, పల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చింతలూరు గ్రామంలో ఉమెన్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

# ఉచిత మెగా వైద్య శిబిరం





**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలం పరిధిలోని చింతలూరు గ్రామంలో నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రాంగణము నందు శనివారం ఉమెన్ డెవలప్ మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్, ఏజిపి బూసి విద్య ప్రసన్న పర్యవేక్షణలో, గన్ని నారాయణరావు, గన్ని సూర్యలక్ష్మి, గన్ని వెంకటరావు సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ వైద్య శిబిరంలో ధరణి వాస్కులర్ అండ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, గౌతమి నేత్రాలయం, రమా దంత వైద్యశాల వైద్య బృందాలు పాల్గొని ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించాయి. సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు కంటి, దంత మరియు ఇతర ప్రత్యేక వైద్య సేవలను అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వంటిపల్లి సతీష్, ఈదర నల్లబాబు, వైట్ల శేషుబాబు, సలాది నాగేశ్వరరావు, ఎంపీడీఓ ఏ. రాజు, నూకాంబికా అమ్మవారి దేవస్థానం చైర్మన్ వీరి అప్పారావు పాల్గొని ప్రారంభించారు. అలాగే విద్యాభ్యాసంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్న ఏఐ అండ్ ఎంఎల్ విద్యార్థి శశాంక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 350 మంది రోగులు పాల్గొని వైద్య సేవలు పొందారు. వైద్యుల సూచనలు మేరకు అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బలుసు శ్రీను, ముప్పిరి వెర్రియ్య, దిడ్డి రాము, కాలా సాయిబాబు, గొడవర్తి కృష్ణమూర్తి, ఈవో వీర్రాజు చౌదరి, బూసి చిట్టికుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ఆక్వా రైతు హత్య కేసులో నిందితుల అరెస్ట్



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం కొత్తమురమళ్ల గ్రామంలో ఈ నెల 17న తీవ్ర సంచలనం సృష్టించిన ఆక్వా రైతు దాట్ల కృష్ణంరాజు (64) హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ విషయాన్ని డీఎస్పీ టి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ వెల్లడించారు. ఐ.పోలవరం పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు. చెరువుల వద్ద పనిచేస్తున్న విశాఖపట్నం జిల్లాకు చెందిన సాలపురెడ్డి బాజీతో పాటు మరో 17 ఏళ్ల మైనర్ బాలుడిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితులను విచారించగా, చెరువు యజమాని కృష్ణంరాజు పని విషయంలో తరచూ తమను దూషించడంతో పని మానేసి, చేసిన పనికి జీతం తీసుకుని వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించినట్లు చెప్పారు. ఈ క్రమంలో బాజీ తన భార్యను ముందుగానే కాకినాడకు పంపించినట్లు తెలిపారు. జీతం ఫోన్‌పే ద్వారా చెల్లించే సమయంలో కృష్ణంరాజు పిన్ నంబర్‌ను గమనించిన నిందితులు, అతని ఖాతాలో ఉన్న నగదును కాజేయాలనే ఉద్దేశంతో హత్యకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఈ క్రమంలో ఇనుప రాడ్‌తో కృష్ణంరాజును హత్య చేసి, మృతదేహానికి తాళ్లతో రాళ్లు కట్టి చెరువులో పడవేశారని తెలిపారు. హత్య అనంతరం మృతుడి మోటార్‌సైకిల్‌ను మరో ప్రాంతంలో వదిలేసి, సెల్‌ఫోన్‌ను తీసుకెళ్లినట్లు తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా సెల్‌ఫోన్, మోటార్‌సైకిల్‌తో పాటు హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే మృతుడి ఖాతా నుంచి రూ.90 వేల నగదును మరో ఖాతాకు బదిలీ చేసినట్లు గుర్తించామని, ఆ మొత్తాన్ని స్వాధీనం చేసుకునే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఈ కేసును సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేసే వరకు చురుకుగా వ్యవహరించిన ముమ్మిడివరం సీఐ ఎం.ఎం. మోహన్ కుమార్, ఎస్సై ఎం.వి.వి. రవీంద్రబాబును డీఎస్పీ అభినందించారు. ఇతర ప్రాంతాల నుంచి పనికి వచ్చే వ్యక్తులను నియమించుకునే ముందు వారి పూర్తి వివరాలు, చిరునామా, ఆధార్ కార్డు, ఫోటోలు తప్పనిసరిగా సేకరించాలని యజమానులకు డీఎస్పీ సూచించారు.

మందేశ్వర స్వామి వారి దేవస్థానం శనివారం

# శ్రీ స్వామి ఆదాయ వివరములు - పోటెత్తిన భక్త జనం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, కొత్తపేట మండలం, మందపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ మందేశ్వర స్వామి వారి దేవస్థానం శనివారం శ్రీ స్వామి వారికి తైలాభిషేకములు మరియు ఇతర పూజల ద్వారా ఆదాయ వివరములు ముఖమండపం, ఏకాదశ రుద్ర తైలాభిషేకం, మహాన్యాస పూర్వక తైలాభిషేకం,తైలం సమర్పించి దర్శనం, తిలదానం,స్వయం హోమం, మొత్తం రూ.98,155/-,ఫోన్ పే ద్వారా రూ.19,435/- పరోక్ష పూజలు ద్వారా రూ.1,01,700/- అన్నప్రసాదం విరాళాలు రూ.21,440 /-మొత్తం రూ.2,40,730/- ఆదాయం వచ్చిందని దారపురెడ్డి సురేష్ బాబు సహాయ కమీషనరు మరియు కార్యనిర్వహణాధికారి తెలియజేశారు.

# అవిడి అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** పరిసరాల పరిశుభ్రత పట్ల చిన్నతనం నుంచే అవగాహన కల్పించాలి. పిల్లలఆరోగ్యం, పోషణ, ప్రాథమిక విద్యాభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు మూలస్తంభంగా పనిచేస్తున్నాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అభిప్రాయపడ్డారు. ఇక్కడ నుంచే స్వచ్ఛ పరిసరాల పట్ల అవగాహన పెరగాలన్నారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అవిడి అంగన్వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పాఠశాలలోని వంటశాల, పరిసరాలు, టాయిలెట్లు పరిశుభ్రతను పరిశీలించారు. పిల్లలకు అందించే కోడిగుడ్లు, పాలు మొదలైన పదార్థాల నాణ్యతను పరిశీలించారు.విద్యార్థులతో ముచ్చటించి వారికి అందుతున్న సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి కేంద్రాలన్నీ పరిశుభ్రంగా నిర్వహించాలని ఎటువంటి అనారోగ్యకర వాతావరణం ఉండడానికి వీల్లేదని అధికారులకు సూచించారు. చిన్నారులకు భోజనం తినిపించారు. అనంతరం సీఎం సతీమణి నారా భువనేశ్వరి పుట్టినరోజు సందర్భంగా చిన్నారులకు స్వీట్లు, చాక్లెట్లు పంచారు.

కొత్తపేట మండలం అవిడి

# ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలకు పాలన చేరువ కావడానికే ప్రజా దర్బార్ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగవంతంగా పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శనివారం కొత్తపేట మండలం అవిడి సచివాలయం వద్ద ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజా దర్బార్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల వద్దకే పరిపాలన చేరుతుందన్నారు. ప్రజల అవసరాలు, సమస్యలు, అభ్యర్థనలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలంటే ప్రజలతో ప్రత్యక్ష సంబంధం అవసరమని, అందుకే తరచూ ప్రజల మధ్యకు వచ్చి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మొత్తం 18 వినతులు అందగా పలు సమస్యలను అక్కడికక్కడే ఎమ్మెల్యే పరిష్కరించారు.

మోదీ 12 సంవత్సరముల సుపరిపాలనలో

# సంక్షేమాలపై ఫోటో ఎగ్జిబిషన్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ నరేంద్ర మోడీ నాయకత్వంలో ప్రగతి పథంలో ముందుకు పన్నెండేళ్లు అభివృద్ధి ప్రస్థానం కార్యక్రమంలో భాగంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా యువమోర్చ అధ్యక్షులు గాణాల కళ్యాణ్ ఆధ్వర్యంలో రామచంద్రపురం నియోజవర్గం రామచంద్రపురం పట్టణం ఆర్టీసీ కాంప్లెక్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వర్యులు వాసంశెట్టి సుభాష్, భారతీయ జనతా పార్టీ అనకాపల్లి జోనల్ ఇన్చార్జ్ కర్రి చిట్టిబాబు,జనసేన ఇంచార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రివర్యులు సుభాష్ మాట్లాడుతూ మోడీ నాయకత్వంలో దేశం మరింత ముందుకు అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో యువమోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి గనిశెట్టి అరవింద్, జిల్లా యువమోర్చ ప్రధాన కార్యదర్శి తోలేటి సూర్య గంగాధర్, ఉపాధ్యక్షులు రాయుడు మణికంఠ, కోటిపల్లి దామోదర్, కార్యదర్శి వెచ్చా దుర్గా ప్రసాద్, వలపశెట్టి కిరణ్, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్ రావు, ఏఎమ్‌సి చెర్మన్ రిషి, డైరెక్టర్ రాఘవేంద్ర, సీనియర్ నాయకులు కొట్టువాడ హరిబాబు, టౌన్ ప్రెసిడెంట్ దునే శ్రీను, అన్వర్, బీజేపీ తెలుగుదేశం జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని నమ్మిన ప్రభుత్వం మాది

**కొత్తపేట నియోజకవర్గంలో 23,085 మంది అన్నదాతల ఖాతాలో రూ.15.25 కోట్ల జమ**

**పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** అన్నదాతల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రభుత్వం తమదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం పార్కు దగ్గర రెడ్డి ఫంక్షన్ హాల్లో జరిగిన పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధుల విడుదల కార్యక్రమంలో ఆయన, జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్,ఆకుల రామకృష్ణ,మార్కెట్ యార్డ్ చైర్మన్ పల్లి మంగాదేవి భీమరావు,ఆత్మ చైర్మన్ జక్కంపూడి బాలాజీ తదితరులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం 23,085 మంది రైతులకు రూ.15.25 కోట్ల విలువైన నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన ప్రతీ హామీని నిలబెట్టుకున్న ప్రభుత్వం కూటమి ప్రభుత్వం అన్నారు. కొత్తపేట నియోజకవర్గంలో గత ఏడాది పీఎం కిసాన్ రూ.6వేలు, రాష్ట్ర ప్రభుత్వ నిధులు రూ.14వేలు మొత్తం రూ.20వేల చొప్పున రూ.43.46 కోట్లు జమ చేసామన్నారు.మరలా నేడు తొలి విడతలో కొత్తపేట మండలంలో 6516 మందికి రూ.4.22 కోట్లు, ఆత్రేయపురం మండలంలో 5,258 మందికి రూ. 3.56 కోట్లు రావులపాలెం మండలంలోని 5,018మంది అన్నదాతలకు రూ.3.22 కోట్లు,ఆలమూరు మండలంలో 6293 మంది అన్నదాతలకు రూ.4.25 కోట్లు, మొత్తం కొత్తపేట నియోజకవర్గంలో నేడు 23,085 మందికి రూ.15.25 కోట్లను జమ చేస్తున్నామన్నారు. పీఎం కిసాన్ కింద ఏడాదికి రూ.6వేలు అందిస్తుంటే.. దేశంలో ఎక్కడా లేని విధంగా కూటమి ప్రభుత్వం రూ.14వేలు కలిపి మొత్తం ఏడాదికి రూ.20,000 ఇచ్చి రైతు పక్షపాతి ప్రభుత్వమని మరోసారి నిరూపించుకున్నామన్నారు. కార్యక్రమంలో భాగంగా రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల చిత్రపటాలకు ధాన్యాభిషేకం నిర్వహించారు.

# శ్రీ ముత్యాలమ్మ జాతర తీర్థ మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం

**ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షులు తొగరుమూర్తి**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం పట్టణంలో వేంచేసి ఉన్న గ్రామ దేవత శ్రీ ముత్యాలమ్మ వారి జాతర తీర్థ మహోత్సవాలను బుధవారం, గురువారం రెండు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ముత్యాలమ్మ ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు తొగరుమూర్తి తెలిపారు. ఆలయంలో జరిగిన కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కోరిన కోరికలు తీర్చే తల్లిగా పేరుగాంచిన శ్రీ ముత్యాలమ్మ వారి జాతర మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు తీర్మానించామన్నారు. ఈ పూజల్లో పాల్గొనే విద్యార్థులకు ఉచితంగా పెన్నులు, పుస్తకాలు అందజేస్తామని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గురువారం తొగరుమూర్తి ఆధ్వర్యంలో ఆలయ పరిసర ప్రాంతంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని భక్తులందరూ తరలివచ్చి అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు. ఈ సమావేశంలో యానాదుల సంఘం ప్రెసిడెంట్ మర్రి గణపతి, వైస్ ప్రెసిడెంట్ మద్దెల అశోక్, కార్యదర్శి వెంకటరమణ, ఆలయ కమిటీ సభ్యులు, కూటమి ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వవాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

కాకినాడ జిల్లా ఎడిషన్

ఆదివారం, 21 జూన్ 2026
www.viswamvoice.com





# జర్నలిస్ట్ వాసుకు 'కాకినాడ ప్రెస్ క్లబ్' చేయూత



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ ప్రెస్ క్లబ్(రిజిస్టర్డ్ నెంబర్ 383/2021) సభ్యులు ఎవరైనా అనారోగ్యంగా ఉంటే వారికి తక్షణం సహాయ సహకారాలు అందించి ఆదుకోవాలని క్లబ్ ఏకగ్రీవంగా తీర్మానించిన విషయం తెలిసిందే. ఈ నేపధ్యంలో క్లబ్ సభ్యులు, ఉదయం ధ్వని స్టాఫ్ రిపోర్టర్ వాసు ఇటీవల జరిగిన ప్రమాదంకు గురై కాకినాడ లక్ష్మీ హాస్పిటల్లో చేతికి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. కాకినాడ బర్మా కాలనీలో ఆయన నివాసం వద్ద విశ్రాంతి తీసుకుంటున్న జర్నలిస్ట్ వాసును క్లబ్ ప్రతినిధులు కలిసి ఆరోగ్యంపై అడిగి తెలుసుకున్నారు. తమ వంతు సాయంగా 25 కేజీల బియ్యం బస్తాతో పాటుగా నిత్యవసర వస్తువులు, పండ్లను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ అన్ని విధాల ఆదుకుంటుందని వాసుకు క్లబ్ అధ్యక్షులు పిఎ అచ్యుత రామారావు, కార్యదర్శి జి శోభన బాబు, కోశాధికారి కోనేటి శ్రీనివాసరావు, క్లబ్ ప్రతినిధులు సంయుక్తంగా హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు రామారావు మాట్లాడుతూ కాకినాడ ప్రెస్ క్లబ్ అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పని చేస్తున్నట్లు వెల్లడించారు. త్వరలో ఎన్నికలు నిర్వహించిన అనంతరం క్లబ్ను మరింత పటిష్టం చేస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రమాదం జరిగినా, లేకపోతే అనారోగ్యంగా ఉన్న నేపధ్యం క్లబ్లో ప్రతీ సభ్యునికి వెంటనే రైస్, నిత్యవసర సరుకులు అంద చేయాలని క్లబ్ అధ్యక్షులు అచ్యుత రామారావు తెలిపారు. ప్రమాదం జరిగిన విధానాన్ని జర్నలిస్టు వాసు క్లబ్ ప్రతినిధులకు వివరించారు. అనారోగ్యంగా ఉన్న తనను క్లబ్ ప్రతినిధులు, సభ్యులు వచ్చి ఆప్యాయంగా పలకరించడంతో పాటుగా రైస్, నిత్యవసర సరుకులు, పండ్లు అందజేయడం చాలా సంతోషంగా ఉందని జర్నలిస్ట్ వాసు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు కె.రాజు, జి.రాంజీ జీ, బి.స్వామి, అజయ్, శాస్త్రి, మనోహర్ రాజు, తిరుమలేశ్, సూర్యనారాయణ, నారాయణ, శివ, భాష, బషీర్ తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడలో చెరగని సంతకం చిరంజీవిని కుమారి



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ ఐడియల్ కాలేజ్ అనే పేరు వినగానే మొదట గుర్తు వచ్చే పేరు చిరంజీవిని కుమారి. కాకినాడలో స్వర్గీయులు అయిన ప్రముఖులలో ఒకరు. కాకినాడలో చెరగని సంతకం అని ప్రముఖులు వాక్య. ఆమె జీవితం మొత్తం పోరాటాల నడుమ మరియు విద్యార్థులకు బలమైన విద్యను అందివ్వాలి వాళ్ల భవిష్యత్తు బాగుండాలి అని ఆకాంక్షతో ఉండేవారు. కాకినాడ సామర్లకోట మధ్యలో ఉన్న ఐడియల్ కళాశాల ఆవరణలో శనివారం నాడు ఐడియల్ కళాశాల అధినేత చిరంజీవని కుమారి మరణం సంవత్సరం పూర్తయినందున కుటుంబ సభ్యుల సమక్షంలో ఆమె మరణాన్ని చింతిస్తూ ప్రథమ సంస్మరణ సభను ఘనంగా జరిపించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ హాజరయ్యారు. ఆమె శత్రుపటానికి నివాళులు అర్పించారు.ఆమె చేసిన సేవలను స్మరించుకున్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్దాం అని మాట్లాడారు. ఎమ్మెల్యేతో పాటు కొంతమంది ప్రముఖులు ఈ సభకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో చిరంజీవిని కుమారి కుటుంబ సభ్యులు మరియు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత

### రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టిబాబు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా రామచంద్రాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో "పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత" అనే అంశంపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టిబాబు ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ప్రజలందరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించడం ద్వారానే మన రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రగా తీర్చిదిద్దుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు తమ ఇళ్లతో పాటు కళాశాల పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకుంటూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. అవగాహన ర్యాలీలో కళాశాల ఐక్యాక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. శ్రీనివాస్, స్వచ్ఛ ఆంధ్ర కోఆర్డినేటర్ ఆర్.ఎన్. రఘురాం, ఇకో క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. సారా, రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ కే. శ్రీదేవి, గీతా, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటా : మంత్రి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలపై 52 వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ప్రజలు వ్యక్తిగత, సామాజిక, సంక్షేమ, మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలను రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి అర్జీని స్వయంగా పరిశీలించిన మంత్రి, సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటికి త్వరితగతిన పరిష్కారం చూపించడమే ప్రజా దర్బార్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులను పారదర్శకంగా స్వీకరించి, వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రజా సమస్యల ఫిర్యాదుల విభాగం ద్వారా అందిన ప్రతి అర్జీపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


### రామచంద్రపురం మున్సిపల్ ఆఫీస్ వద్ద ఏఐటీయూసీ ధర్నా



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ మున్సిపల్ వర్కర్స్ (పర్మినెంట్ అండ్ కాంట్రాక్ట్) యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా రామచంద్రపురం మున్సిపల్ ఆఫీస్ వద్ద శనివారం ఉదయం నిరసన ధర్నా నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ వర్కర్లను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. పురపాలక సంఘ పరిధిలో కొత్తగా ఏర్పడిన కాలనీలు, లేఅవుట్లు, పెరిగిన జనాభాకు అనుగుణంగా అదనపు పారిశుధ్య కార్మికులను నియమించి ప్రస్తుత కార్మికులపై ఉన్న పని భారాన్ని తగ్గించాలన్నారు. అలాగే పర్మినెంట్ కార్మికులకు బకాయి ఉన్న ఐదు డీఏలు, లీవ్ ఎన్క్యాష్మెంట్ తక్షణమే చెల్లించాలని, కరోనా కష్టకాలంలో పనిచేసిన పారిశుధ్య కార్మికులను ఆప్కాస్ (ఆప్కాస్) పరిధిలోకి తీసుకువచ్చి రూ.21 వేల జీతం అమలు చేయాలని కోరారు. గతంలో సఫాయి కర్మచారి మిషన్ చైర్మన్ ఆదేశాల మేరకు ఇల్లు లేని మున్సిపల్ కార్మికులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పి. రాము, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎ.మాచర రావు, మీసాల గోపి మాట్లాడుతూ చాలా కాలంగా పరిష్కారం కాని మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. దశలవారీ పోరాటంలో భాగంగా ఈ నెల 22వ తేదీన స్థానిక శాసనసభ్యునికి వినతిపత్రం అందజేస్తామని 24వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. అలాగే జూలై 7వ తేదీన చేపట్టే 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని జయప్రదం చేయడం ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి న్యాయమైన సమస్యలను సాధించుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సి. అనిల్, వి.రవి, జి.అప్పారావు, ఎన్.అప్పారావు, జి.కొండయ్య, పి.నూకరత్నం, వి. వినుమతి, ఎం.నాగమణి, వి.దేవి మరియు కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అన్నదాతల ఖాతాల్లో రూ.9.19 కోట్లు..

### అమలాపురంలో 'అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్' నిధుల విడుదల



**అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్' పథకం 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన తొలి విడత నిధుల విడుదల కార్యక్రమం అమలాపురం మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పాల్గొని నియోజకవర్గ రైతులకు నిధుల విడుదలకు సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ పథకం ద్వారా అమలాపురం నియోజకవర్గ పరిధిలోని 13,403 మంది అర్హులైన రైతుల ఖాతాల్లో మొత్తం రూ.9.19 కోట్లు నేరుగా జమయ్యాయి. రైతులకు సాగు పెట్టుబడి భారం తగ్గించడంతో పాటు వ్యవసాయ కార్యకలాపాలకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ మార్గదర్శకత్వం, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నాయని అన్నారు. దేశవ్యాప్తంగా రైతుల అభ్యున్నతి కోసం అమలు చేస్తున్న పీఎం కిసాన్ యోజనను రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకంతో అనుసంధానం చేసి రైతులకు మరింత ఆర్థిక భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. సాగు సీజన్ ప్రారంభ దశలోనే రైతుల ఖాతాల్లోకి నిధులు జమ కావడం వల్ల వ్యవసాయ పనులు సకాలంలో చేపట్టేందుకు వీలు కలుగుతుందని తెలిపారు. ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పూర్తి పారదర్శకతతో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా నిధులు జమ చేయడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు. అమలాపురం రూరల్, అల్లవరం, ఉప్పలగుప్తం తదితర మండలాల పరిధిలోని వేలాది రైతు కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగపడుతుందని, అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మండల పరిషత్ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. సకాలంలో తమ ఖాతాల్లోకి నిధులు జమ కావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ కార్యక్రమాలను అభినందించారు.

## అనుభవసారం!



చండప్రచండ మార్తాండుడి తాపనానికి తలవొగ్గాకే...
జాబిలి కురిపించే చల్లని కౌముదిపై ప్రేమ పుడుతుంది!
నిబిడాంధకారపు అమాస రాతిరిని భరించాకే...
షోడశ కళల పౌర్ణమి వెన్నెలపై ఇష్టం కలుగుతుంది!
కాలం పెట్టే కఠిన పరీక్షల కడలి అలలను దాటాకే ...
ప్రశాంత సుఖాల తీరం స్వాగతం పలుకుతుంది!
కష్టాల రాపిడికి గురై,
కన్నీటిని దిగమింగాకే...
మనిషికి.. ఆ అనుభవసారం..
హాయినిస్తుంది!!



– పరస జగన్నాధరావు
టీచర్,రాజమహేంద్రవరం

### దాత సహకారంతో హై స్కూల్ విద్యార్థులకు

## డైరీలు అందజేత



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్టూడెంట్ డైరీ ఏ రోజు హోమ్ వర్క్ ఆ రోజే పూర్తి చేసుకోవడానికి విద్యార్థులకు చాలా బాగుంటుంది ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని రావులపాడు జడ్పీ హై స్కూల్ నందు గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు దాత పెచ్చేటి చిన్నారావు అందించిన 25000 రూపాయల విలువైన స్టూడెంట్స్ డైరీ లు 250 మంది విద్యార్థులకు రావులపాడు గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్,ఎంపీడీఓ చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సుబ్రహ్మణ్య మాట్లాడుతూ గవర్నమెంట్ స్కూల్లో స్టూడెంట్ డైరీ పెట్టడం చాల వినూత్నంగా ఉంది ఇది మంచి పరిణామమణి, ఈ విధానం అనుసరించడం పట్ల విద్యార్థులకు ఉపాద్యాయుల బాధ్యత పెంచుతుంది తల్లిదండ్రులు కు ప్రభుత్వ విద్యాలయాల పట్ల నమ్మకం కలగడమే కాకుండా విద్యార్థులకు తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మరింత బాధ్యత పెంచుతుంది తెలిపారు. ఈ సందర్భంగా దాత చిన్నారావు కు అభినందనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మధుసుదనరావు తాజా మాజీ సర్పంచ్ బాబ్జి, గెడ్డం శ్రీనివాస్ ఉపాద్యాయుల కెవి శేఖర్ జి.సునీత సత్యవతి ఆంజనేయ యేలు శ్యామల వీరావేణి మేరీ జాన్స్ వసుంధర వెంకటలక్ష్మి సుజాత, గోపాల కృష్ణ మేక సూర్యారావు తదితరలు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం స్థానిక నారాయణ పాఠశాలలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని శనివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ పి.సుభాష్ సార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి.సుభాష్ మాట్లాడుతూ మానవాళికి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించడంలో యోగా అద్భుతమైన సాధనంగా ఉపయోగపడుతుందని కొనియాడారు. జీవితంలో సరైన సర్దుబాటు లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని, వీటన్నింటికీ యోగా ద్వారా చక్కని పరిష్కారం లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రతిరోజూ ఉదయాన్నే క్రమం తప్పకుండా వ్యాయామం చేయడంతో పాటు, వివిధ రకాల యోగాసనాలను వేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను సైతం సొంతం చేసుకోవచ్చని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఒత్తిడిని దూరం చేసి, ఏకాగ్రతను పెంచేందుకు యోగా ఎంతో దోహదపడుతుందని ఉద్ఘాటించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం కలిసి పలు రకాల ఆసనాలను, ప్రాణాయామాన్ని ప్రదర్శించారు. విద్యార్థుల్లో యోగా పట్ల అవగాహన కల్పించేలా సాగిన ఈ కార్యక్రమం అందరినీ ఎంతగానో ఆకట్టుకుంది.

### అంగన్వాడి కేంద్రాన్ని

## ఆకస్మిక తనిఖీ చేసిన ఎమ్మెల్యే వనమాడి



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** అంగన్వాడి కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారం, హాజరు, పరిశుభ్రతపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని, నాణ్యత విషయంలో రాజీ పడేదే లేదని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. శనివారం స్థానిక 39వ డివిజన్, రామారావు పేట, మేడురు వారి వీధి నందు ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని శాసనసభ్యులు వనమాడి కొండబాబు అకస్మక తనిఖీ చేసి, కేంద్రంలో పిల్లల హాజరు పట్టిక, అంగన్వాడి నిర్వహణ, అందిస్తున్న సేవలను పరిశీలించి, చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహార వివరాలను అంగన్వాడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, హాజరు, పరిశుభ్రతపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని, పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు అవసరమైన ఆహారం నాణ్యంగా అందించడం జరుగుతుందని, చిన్నారుల ఆరోగ్యం దృష్ట్యా పరిశుభ్రమైన వాతావరణాన్ని ఎల్లప్పుడూ కొనసాగించే విధంగా చర్యలు తీసుకోని, పిల్లలకు అందించే ప్రతి సేవలో నాణ్యత, పారదర్శకత పాటించే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మల్లిపూడి వీరు, రమేష్, అరుణ, ఖాజా, అంగన్వాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో

## ఘనంగా "స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర" కార్యక్రమం



**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమం కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ బిందుమాధవ్, ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ , ఇతర ఉన్నతాధికారు లతో కలిసి స్వయంగా మొక్కలు నాటారు. అనంతరం అధికారులు, సిబ్బంది కలిసి పరిసరాలను శుభ్రంచేసి, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనకు, పచ్చదనం పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా ఎస్పీ పిలుపునిచ్చారు. కార్యక్రమం చివరిలో అందరూ స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ అడిషనల్ ఎస్పి (అడ్మిన్) డాక్టర్ మహంతి కిషోర్ కుమార్, కాకినాడ అడిషనల్ ఎస్పి (ఏ ఆర్) ఎస్.శ్రీనివాసరావు, కాకినాడ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ పాటిల్ దేవరాజ్ మనీష్, ఐపిఎస్, ఎస్బి డిఎస్పి కెవివి సత్యనారాయణ, ఏఆర్ డిఎస్పీ విజి శ్రీహరిరావు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ దుర్గాప్రసాద్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ కె వెంకటరావు, రిజర్వ్ సబ్ ఇన్స్పెక్టర్ వల్లీ బాబా, పోలీసు సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే జిల్లావ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఆయా స్టేషన్ల ఎస్ఐలు, సిఐలు, పోలీస్ సిబ్బంది పోలీస్ స్టేషన్ల పరిసరాలను శుభ్రపరుచుకున్నారు.

## శ్రీ చైతన్య స్కూల్లో అంతర్జాతీయ యోగా దినోత్సవం



**మండపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని తాపేశ్వరం శ్రీ చైతన్య స్కూల్లో విద్యార్థులకు ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు యోగా ప్రాముఖ్యత, వివిధ యోగాసనాల రకాలు, యోగా చేయడం వల్ల కలిగే శారీరక మానసిక ప్రయోజనాలను వివరించారు. అనంతరం విద్యార్థులతో వివిధ యోగాసనాలను చేయించి వాటి సరైన విధానాన్ని తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రీజినల్ ఇన్చార్జ్ నరేష్ మాట్లాడుతూ, నేటి వేగవంతమైన జీవనశైలిలో ప్రతి ఒక్కరూ యోగాను తమ దినచర్యలో భాగం చేసుకోవాలని సూచించారు. యోగా ద్వారా మనశ్శాంతి, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులు ప్రతిరోజూ యోగా అభ్యసించడం ద్వారా విద్యలో మెరుగైన ఫలితాలు సాధించగలరని పేర్కొన్నారు.యోగాను ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన భారతీయ సంస్కృతి సంపదగా అభివర్ణిస్తూ, ఆరోగ్యకరమైన జీవితానికి యోగా ఉత్తమ మార్గమని అన్నారు.

## యోగాతో ఆరోగ్యకరమైన జీవనం సాధ్యం

### ముఖ్య అతిథి డాక్టర్ మల్లిడి అమ్మిరెడ్డి



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** విద్యార్థుల్లో యోగా పట్ల అవగాహన పెంపొందించడం, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవాటు చేయడమే లక్ష్యంగా యోగ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు విజ్ఞాన్ విద్యాసంస్థల అకాడమిక్ డైరెక్టర్ మల్లిడి అమ్మిరెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాయవరం విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం యోగా అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ యోగా గురువు వెలగల ఫణికృష్ణారెడ్డి విద్యార్థులకు వివిధ యోగా ఆసనాలను ప్రదర్శించి, వాటి ప్రాముఖ్యతను వివరించారు. నిత్య జీవితంలో యోగా సాధన చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో యోగాను ఒక భాగంగా చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. మల్లిడి అమ్మిరెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యం ఎంతో అవసరమని, యోగా, ధ్యానం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, సానుకూల ఆలోచనలు పెరుగుతాయని పేర్కొన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్. నవీన్ మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులకు కేవలం విద్యా ప్రమాణాలే కాకుండా ఆరోగ్యం, క్రమశిక్షణ, విలువలు కూడా అందించే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థుల సంపూర్ణ అభివృద్ధికి యోగా వంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యాసంస్థల డైరెక్టర్ డా. మల్లిడి శేషవేణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్
ఆదివారం, 21 జూన్ 2026
www.viswamvoice.com





నీట్ (యూజీ)-2026 రీ-ఎగ్జామినేషన్‌ను

# పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి

**జిల్లాలో 9 పరీక్షా కేంద్రాల్లో నీట్ రీ-ఎగ్జామ్స్ హాజరు కానున్నా 3363 మంది అభ్యర్థులు**
**పరీక్షా కేంద్రానికి ఒక్క నిమిషం ఆలస్యమైనా ప్రవేశం ఉండదు**
**మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించడం జరగదు : కలెక్టర్ కీర్తి చేకూరి**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** నీట్ (యూజీ)-2026 రీ-ఎగ్జామినేషన్‌ను ఈనెల 21 (ఆదివారం) జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అత్యంత పారదర్శకంగా, భద్రతా ప్రమాణాలతో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. ఇందుకు సంబంధించి అధికారులు పూర్తి స్థాయిలోమార్గదర్శకాలు అనుసరించి పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ శనివారం అమరావతి వెలగపూడి సచివాలయం నుంచి అన్ని జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో నీట్ పరీక్ష నిర్వహణపై సమగ్ర మార్గదర్శకాలను వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్. భాస్కర్ రెడ్డి, పోలీసు, విద్య, వైద్య, రవాణా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 9 పరీక్షా కేంద్రాల్లో 3,363 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నందున అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని ఆదేశించారు. పరీక్ష నిర్వహణలో భద్రత, పారదర్శకతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రశ్నపత్రాల భద్రత, పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, సీసీటీవీ నిఘా, బయోమెట్రిక్ ధృవీకరణ, అభ్యర్థుల తనిఖీలు, ప్రశ్నపత్రాల రవాణా, ఓఎంఆర్ షీట్ల భద్రత తదితర అంశాల్లో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు ఉండరాదన్నారు. ఆదివారం మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.15 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. అభ్యర్థులకు ఉదయం 11.00 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి ప్రవేశం కల్పిస్తామని, మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా ఎట్టి



పరిస్థితుల్లోనూ పరీక్షా కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. అందువల్ల అభ్యర్థులు కనీసం రెండు గంటల ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకుని అవసరమైన ధృవపత్రాలతో సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రతి అభ్యర్థికి ఆధార్ ఆధారిత బయోమెట్రిక్, ఫేస్ ఆథెంటికేషన్ నిర్వహిస్తారని తెలిపారు. ధృవీకరణలో సాంకేతిక సమస్యలు తలెత్తినా నిబంధనల మేరకు అండర్‌టేకింగ్ తీసుకుని పరీక్షకు అనుమతించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్ పరికరాలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు పూర్తిగా నిషేధమని తెలిపారు. రెండు దశల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మహిళా అభ్యర్థులకు ప్రత్యేక తనిఖీ ఏర్పాట్లు, మహిళా సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. అభ్యర్థుల సౌకర్యార్థం ప్రతి పరీక్షా కేంద్రంలో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స, అంబులెన్స్ సేవలు, విద్యుత్ సరఫరా, అగ్నిమాపక శాఖ స్టాండ్‌బై బృందాలు, పోలీసు బందోబస్తు తదితర అన్ని మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. తల్లిదండ్రుల కోసం నీడ, కూర్చునే సౌకర్యం, తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వాతావరణ శాఖ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ప్రత్యామ్నాయ రవాణా ఏర్పాట్లు, అత్యవసర బృందాలు సిద్ధంగా ఉంచాలని, పరీక్షా సామగ్రి భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించామన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపిఎస్ఆర్టీసీ) ద్వారా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు ఆమె తెలిపారు. అన్ని శాఖలు జిల్లా కంట్రోల్ రూమ్‌తో నిరంతరం సమన్వయం పాటిస్తూ ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు.

**జిల్లాలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలు:**

ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజమహేంద్రవరం 576 మంది,

ప్రభుత్వ కళాశాల (అటానమస్), రాజమహేంద్రవరం - 507 మంది,

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ - 504 మంది,

ఎస్‌కేవీటీ ఈఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల - 360 మంది

కేంద్రీయ విద్యాలయం, ఓఎన్‌జీసీ బేస్ కాంప్లెక్స్- 360 మంది

ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల- 288 మంది

నెహ్రూ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ - 264 మంది,

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ - 240 మంది,

దానవాయిపేట మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ - 264 మంది.

**అభ్యర్థులకు ముఖ్య సూచనలు**

పరీక్షా కేంద్రానికి కనీసం రెండు గంటల ముందుగానే చేరుకోవాలి.

అడ్మిట్ కార్డు, ఆధార్ లేదా చెల్లుబాటు అయ్యే గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలి.

మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత ఎవరినీ పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు.

మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, బ్లూటూత్ పరికరాలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకురాకూడదు.

పరీక్షా కేంద్రంలో విధి నిర్వహణలో ఉన్న అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలి.

# కక్ష సాధింపులే లక్ష్యంగా కూటమి పాలన

**కారుమూరి సునీల్ అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం : జక్కంపూడి రాజా విమర్శలు**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రజలకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయడంలో విఫలమైన కూటమి ప్రభుత్వం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆరోపించారు. రాజమహేంద్రవరం ప్రకాశ్‌నగర్‌లోని తన కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రెండేళ్ల కూటమి పాలన పూర్తిగా గాడితప్పిందన్నారు. మహిళలకు నెలకు రూ.1,500, నిరుద్యోగులకు రూ.3,000 భృతి, బీసీలు, కాపీలకు ఇచ్చిన హామీలు అమలు కాకుండా పోయాయని విమర్శించారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను పక్కనపెట్టి రాజకీయ ప్రత్యర్థులను ఆర్థికంగా, మానసికంగా దెబ్బ తీయడమే లక్ష్యంగా పనిచేస్తోందని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ నాయకులు, కార్యకర్తలపై నమోదైన కేసులు, దాడులే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. లిక్కర్ పాలసీ అంశాన్ని ప్రస్తావిస్తూ, వైఎస్సార్‌సీపీ హయాంలో పార



దర్శకంగా మద్యం విధానం అమలు చేశామని, ఇప్పుడు అదే విధానంపై అవకతవకల పేరుతో కేసులు నమోదు చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మద్యం మాఫియా ఆగడాలు పెరిగిపోయాయని ఆరోపించారు. మద్యం దుకాణాల టెండర్లలో కూటమి నాయకులు జోక్యం చేసుకుని, ఇతరులను బెదిరించి దుకాణాలను చేజిక్కించుకున్నారని, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయించి ప్రజలను దోచుకుంటున్నారని అన్నారు. ఈ వ్యవహారంలో అధికార పార్టీ నాయకుల ప్రమేయం ఉందని ఆరోపించారు. లిక్కర్ స్కామ్ పేరుతో వైఎస్సార్‌సీపీ నేతలపై కేసులు నమోదు చేయడం రాజకీయ వేధింపులేనని పేర్కొన్నారు. ఎంపీ మిథున్ రెడ్డి నుంచి కారుమూరి సునీల్ వరకు సంబంధం లేని వారిని కూడా ఈ కేసుల్లో ఇరికిస్తున్నారని అన్నారు. బీసీ వర్గానికి చెందిన కారుమూరి సునీల్ రాజకీయంగా ఎదుగుతున్నారనే కారణంతోనే లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితి క్షీణించిందని, మహిళలపై దాడులు పెరిగాయని, పోలీసు వ్యవస్థ ప్రజల సమస్యల కంటే రాజకీయ ఆదేశాల అమలుపైనే దృష్టి సారిస్తోందని విమర్శించారు. సీఐడీ, ఏసీబీ వంటి సంస్థలను ఉపయోగించి వైసీపీ నాయకులను ఇబ్బంది పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. కారుమూరి సునీల్‌కు వైఎస్సార్‌సీపీ రాష్ట్రవ్యాప్తంగా అండగా ఉంటుందని, కేసులతో ఆయనను రాజకీయంగా దెబ్బతీయలేరని జక్కంపూడి రాజా స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను విస్మరించి కక్షసాధింపు రాజకీయాలకు పాల్పడుతోందని, ప్రజలు త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు.

సత్యసాయి బాబా మంచినీటి ట్యాంక్ వద్ద

# పెరిగిన పొదలు.. ప్రజల్లో ఆందోళన

**గోకవరం, నేటివార్త :** విశ్వం వాయిస్ న్యూస్: మండల పరిధిలోని మోడ్రన్ ఇందిరమ్మ కాలనీలో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న సత్యసాయి బాబా మంచినీటి ట్యాంక్ పరిసర ప్రాంతం పొదలు, తుప్పలతో నిండిపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంక్ వద్దకు నిత్యం మంచినీటి కోసం వచ్చే మహిళలు, వృద్ధులు పొదల్లో విషసర్పాలు సంచరించే అవకాశం ఉందని భయాందోళనకు గురవుతున్నారు. ప్రధాన రహదారిపై ఉన్న ఈ మంచినీటి ట్యాంక్ వద్ద స్థానికులతో పాటు ప్రయాణికులు, వాహనదారులు కూడా దాహార్తి తీర్చుకునేందుకు తరచూ వస్తుంటారు. అయితే ట్యాంక్ చుట్టూ పెరిగిన పొదలు, చెత్త కారణంగా పరిసర ప్రాంతం అపరిశుభ్రంగా మారిందని ప్రజలు పేర్కొంటున్నారు. వర్షాకాలం నేపథ్యంలో పొదలు మరింతగా పెరిగి, పాములు మరియు ఇతర విషపూరిత జీవులు దాగి ఉండే ప్రమాదం ఉందని స్థానిక మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి ట్యాంక్ పరిసరాల్లోని పొదలను తొలగించి, ప్రాంతాన్ని



పూర్తిగా శుభ్రపరచాలని కోరుతున్నారు. అలాగే ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందేలా ట్యాంక్‌ను క్రమం తప్పకుండా పరిశుభ్రం చేయడంతో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

## సర్‌కు అంగన్వాడి ఏఎన్ఎంలు సహకరించండి : తహసిల్దార్ సునీత

**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సర్ ప్రక్రియ మండలంలో శరవేగంగా కొనసాగుతోందని తహసిల్దార్ సునీత తెలిపారు. శనివారం తాసిల్దార్ సునీత ఆదేశాల మేరకు మండలంలోని గ్రామాల్లోని సచివాలయంలో కొనసాగుతున్న సర్ కార్యక్రమాన్ని సూపర్వైజర్లు తిలకించారు. అనంతరం సూపర్వైజర్లు మాట్లాడుతూ సార్ నమోదుకు అంగన్వాడీలు, ఏఎన్ఎంలు



బిఎల్ఓలకు అన్నివిధాల పూర్తి సహాయ సహకారాలు అందించాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు సర్ ప్రక్రియలో మరణించిన, శాశ్వతంగా నివాసాలు విడిచి వెళ్లిన, వడబల్ ఎంట్రీ ఉన్న వారిని శాశ్వతంగా తొలగించాలన్నారు. 2026 జూలై 1వ తేదీ నాటికి 18 సంవత్సరాల నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్, వీఆర్వో, గ్రామ మహిళా పోలీస్, ఏఎన్ఎం, అంగన్వాడిలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మధురపూడి విమానాశ్రయంలో పవన్, నాదెండ్లకు ఘన స్వాగతం

**మోడీ ఆదేశాలను ఆచరిస్తున్న పవన్**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** జనసేన పార్టీ అధినేత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణదల పవన్ కళ్యాణ్ కు మధురపూడి విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. శనివారం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పౌరసరఫరాలశాఖ మాత్యులు నాదెండ్ల మనోహర్, లింగం నేని రమేష్‌లు కాకినాడలో గోదావరి కళాక్షేత్రంలో అధికారులతో జరిగే "మాటబి మంతి" కార్యక్రమాన్ని సమీక్షించడానికి మధురపూడి విమానాశ్రయానికి విచ్చేశారు. అనంతరం విమానాశ్రయం లోని ఎనిమిదవ గేట్ మార్గం నుండి రోడ్ మార్గం మీదగా పవన్ తదితరులు కాకినాడ వెళ్లారు. ప్రధానమంత్రి మోదీ ఆదేశాలలో భాగంగా ఇంధన పొదుపు చేసే నిమిత్తం పవన్ కాన్వాయ్ ని కుదించుకున్నారు. మధురపూడి చేరుకున్న పవన్ కళ్యాణ్ తదితరులకు పర్యాటకశాఖమాత్యులు కందుల దుర్గేష్, రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ తదితరులు పవన్ కు పుష్పగుచ్ఛం అందజేసి ఘనస్వాగతం పలికారు.

# మత్తు పదార్థాల సేవనంతో జీవితం సర్వనాశనం

**చిన్న మత్తుతో పెద్ద ఎత్తున నష్టం**

**మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి గౌరవప్రదమైన పౌరులుగా జీవించండి : మెప్మా పీడీ కనకరాజు పిలుపు**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మత్తు పదార్థాలకు బానిసై సమాజానికి చేటు చేయడంతో పాటు జీవితాన్ని కష్టాలపాలు చేసుకోవద్దని మెప్మా జిల్లా ప్రాజెక్టు అధికారి పి కనకరాజు కోరారు. స్థానిక కంబాల చెరువు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో గల పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో జరిగిన డ్రగ్స్ వద్దు అనే అవగాహన కార్యక్రమంలో కనకరాజు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి స్వర్ణాంధ్ర స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు లయన్ డాక్టర్ గుబ్బల రాంబాబు అధ్యక్షత వహించారు. ఈగల్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన కార్యక్రమానికి సర్కిల్ ఇన్స్పెక్టర్ సూర్య మోహన్ మరో ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడపడానికి ప్రభుత్వం అనేక పథకాలను అందిస్తుందని నిరాశ్రయులు ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకుని కుటుంబ సభ్యుల చెంతకు చేరి గౌరవప్రదంగా జీవించాలని సూచించారు. ఈగల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సూర్య మోహన్ మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. మత్తు పదార్థం చిన్నగా ఉండి జీవితానికి పెద్ద ఎత్తున నష్టం కల్పిస్తుందని వీలైనంతవరకు మాదకద్రవ్యాల సేవనం ప్రమాదమని గుర్తించి దానికి దూరంగా ఉండాలన్నారు .సబ్ ఇన్స్పెక్టర్ బి. నరేష్ మాదకద్రవ్యాలకు బానిస అయిన వారి, అమ్ముతున్న వారి సమాచారం తమకు అందిస్తే గోప్యంగా ఉంచుతామన్నారు. అత్తుపదార్థాల సేవనం తప్పని మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని, గౌరవప్రదమైన మనుషులుగా సంఘంలో జీవిస్తామని ఈగల్ సీఐ సూర్యమోహన్ నిరాశ్రయుల చేత ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో పలువురు ఈగిల్ సిబ్బంది ,స్వర్ణాంధ్ర ఎన్జీవో సిబ్బంది నిరాశ్రయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మోదీ, చంద్రబాబు, పవన్ నాయకత్వంతో

# అభివృద్ధి దిశగా ఏపీ : కుడుపూడి సత్తిబాబు

**ప్రజా సంక్షేమమే లక్ష్యం.. కూటమి ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం - ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప - పసుపు తోరణాలతో నిండిన పెద్దాపురం**

**పెద్దాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ పార్లమెంట్ ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాథ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం రెండేళ్లు విజయవంతంగా సుపరిపాలన అందించిన సందర్భంగా సామర్లకోట రైల్వే స్టేషన్ నుండి స్థానిక సూర్య ఫంక్షన్ హాల్ వరకు దారులను పసుపు తోరణాలతో నింపి పెద్ద ఎత్తున భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్,పెద్దాపురం పార్టీ పరిశీలకులు కుడుపూడి సత్తిబాబు హాజరయ్యారు. ర్యాలీ అనంతరం ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందిస్తూ, సంక్షేమం మరియు అభివృద్ధిని సమన్వయం చేస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోందని పేర్కొన్నారు. అలాగే కూటమిలోని మూడు పార్టీలు పరస్పర సహకారం, సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నాయని అన్నారు. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రానికి కేంద్రం నుంచి అవసరమైన మద్దతు లభిస్తోందని, జాతీయ స్థాయిలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం దక్కుతోందని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, యువత, రైతులు, మహిళల అభ్యున్నతికి అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సీఎం చంద్రబాబు పాలన



సమర్థవంతంగా కొనసాగుతుందని తెలిపారు. సీఎం చంద్రబాబు దూరదృష్టి, నరేంద్ర మోదీ నాయకత్వం, పవన్ కళ్యాణ్ నిబద్ధత కలిసివచ్చి ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి వైపు నడిపిస్తున్నాయని అన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం విజయవంతమైందని తెలిపారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని, రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు, పెద్ద సంఖ్యలో పాల్గొని నియోజకవర్గం దారులను పసుపు తోరణాలతో చేశారు.

విద్యకు ఆర్థిక సహాయం

## అందించిన కుడుపూడి సత్తిబాబు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక 3వ వార్డుకు చెందిన తెలుగు దేశం పార్టీ కార్యకర్త బొమ్మనైన నరసింహుడు దంపతుల పిల్లల విద్యాభ్యాసానికి అవసరమైన పుస్తకాల కొనుగోలు కోసం రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యకర్తల కుటుంబాల సంక్షేమం తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకుని భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సహాయానికి నరసింహుడు దంపతులు కుడుపూడి సత్తిబాబుకి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రజలకు మేలు చేయడానికి ఎన్ని అవమానాలనైనా భరిస్తా

**నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గ ప్రజలకు మేలు చేయడానికి ప్రతిపక్షం వారు నన్ను ఎన్ని అవమానాలు చేసినా భరించడానికి సిద్ధంగా ఉన్నానని జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి అన్నారు. శుక్రవారం రాత్రి బూరుగుపూడి ద్వారకామయ్య ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన ఎన్డీఏ ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం-అభివృద్ధి సంక్షేమం పేరుతో నిర్వహించిన విజయోత్సవ సభకు ఆమె విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన భర్త బలరామకృష్ణ రాజానగరం నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా కూటమితో మమేకమై అహర్నిశలు శ్రమిస్తున్నారు. నియోజవర్గ అభివృద్ధి, ప్రజలకు సేవే పరమావధిగా బత్తుల కుటుంబం ముందుకు సాగుతుందన్నారు. ప్రతిపక్షం ఎన్ని అవాకులు చపాకులు పేలిన, ఎన్ని అవమానాలు చేసిన ప్రజలకు మేలు జరుగుతుందంటే భరించడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. అనారోగ్యంతో ఉండి కష్టకాలంలో ఉన్న ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను వాళ్ళు స్వగృహానికి వెళ్లి అందజేయడంలో తప్పేముందన్నారు. తాను ఎప్పుడు ప్రభుత్వ ఉన్నతాధికారులతో ఏ పని కోసం మాట్లాడిన దాఖలాలు లేవన్నారు. నియోజకవర్గ ప్రజలు తనను ఆడపడుచుల ఆదరిస్తున్నారని, దీంతో ప్రతిపక్షం అక్కసు వెళ్ళబోతుందని, అది వారి విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. ఏది ఏమైనా అంతిమంగా నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా శ్రేయసే తన కుటుంబానికి ముఖ్యమన్నారు.



### కూతురు క్లింకార ఫేస్

# రివీల్ చేసిన రామ్ చరణ్

### ఎంత ముద్దుగా ఉందో..



రామ్ చరణ్, ఉపాసన గారాల పట్టి క్లింకార కొణిదెల పుట్టిన రోజు నేడు. ఈ సందర్భంగా తమ ముద్దుల కూతురు ఫేస్ రివీల్ చేశారు చెర్రీ దంపతులు. ప్రస్తుతం క్లింకార ఫోటో నెట్టింట వైరలవుతుండగా.. మెగా ప్రిన్సెస్ ఎంత ముద్దుగా ఉందో అంటూ మురిసిపోతున్నారు మెగా ఫ్యాన్స్. మెగా పవర్ స్టార్, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ – ఉపాసనల ముద్దుల కుమార్తె క్లీంకార కొణిదెల ముఖాన్ని చూడాలని మెగా అభిమానులతో పాటు ప్రేక్షకులంతా ఎంతో కాలంగా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మెగా పవర్ స్టార్, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ – ఉపాసనల ముద్దుల కుమార్తె క్లీంకార కొణిదెల ముఖాన్ని చూడాలని మెగా అభిమానులతో పాటు ప్రేక్షకులంతా ఎంతో కాలంగా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. సెలబ్రిటీల పిల్లల ప్రైవసీని కాపాడాలనే ఉద్దేశంతో చరణ్ దంపతులు ఇప్పటివరకు క్లీంకార ఫేస్ కనిపించకుండా చాలా జాగ్రత్తలు తీసుకుంటూ వచ్చారు. అయితే ఇప్పుడు క్లింకార పుట్టినరోజు కావడంతో రామ్ చరణ్, ఉపాసన కలిసి తమ ఫ్యామిలీ ఫోటోను సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేశారు. అందులో క్లింకార తల్లిదండ్రులతో కలిసి నవ్వుతూ కనిపించింది. ఇదిలా ఉంటే.. గతంలో బాలకృష్ణ హోస్టింగ్ చేసిన అన్ స్టాపబుల్ టాక్ షోలో రామ్ చరణ్ మాట్లాడుతూ.. క్లీంకారపై ఎలాంటి పబ్లిక్ ఒత్తిడి ఉండకూడదని, తను ఎప్పుడైతే సొంతంగా 'నాన్నా' అని పిలుస్తుందో అప్పుడే అధికారికంగా ప్రపంచానికి చూపిస్తానని సరదాగా చెప్పుకొచ్చారు. కానీ ఆ తర్వాత తిరుమల శ్రీవారి దర్శన సమయంలో మెగా ప్రిన్సెస్ ఫోటోస్ నెట్టింట వైరల్ అయినప్పటికీ ఫేస్ మాత్రం కనిపించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు ఉపాసన. ఇక ఇప్పుడు తమ చిన్నారి ఫోటోను స్వయంగా నెట్టింట షేర్ చేశారు రామ్ చరణ్, ఉపాసన దంపతులు. చిన్నారి క్లీంకార చాలా ముద్దుగా, క్యూట్‌గా ఉందంటూ మెగా ఫ్యాన్స్ ఈ ఫోటోలను షేర్ చేస్తూ నెట్టింట పండగ చేసుకుంటున్నారు. "అచ్చం అమ్మ ఉపాసనలాగే ఉంది", "మెగా ప్రిన్సెస్ సూపర్ క్యూట్" అంటూ నెటిజన్లు కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. ఇటీవలే పెద్ది సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు రామ్ చరణ్. డైరెక్టర్ బుచ్చి బాబు సన దర్శకత్వం వహించిన ఈ సినిమాకు పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం ఇప్పటి వరకు దాదాపు రూ.400 కోట్లకు పైగా వసూల్లు రాబట్టి బాక్సాఫీస్ రికార్డులు తిరిగరాసింది. ఇందులో జాన్వీ కపూర్ కథానాయికగా నటించగా.. ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు.

# మనసుకు విశ్రాంతి కావాలి..

### అందుకే సోషల్ మీడియాకు దూరంగా టాలీవుడ్ హీరోయిన్..



ఇప్పుడిప్పుడే తెలుగు చలన చిత్ర పరిశ్రమలో వరుస సినిమాలతో తనకంటూ ప్రత్యేక ఇమేజ్ క్రియేట్ చేసుకుంది. గ్లామర్ లుక్స్, అద్భుతమైన నటనతో కట్టిపడేస్తున్న ఈ వయ్యారి.. ఇటీవల సోషల్ మీడియాలో సెన్సేషన్ అయ్యింది. వరుస గ్లామర్ ఫోటోషూట్లతో నెట్టింట రచ్చ చేస్తుంది. తాజాగా కీలక నిర్ణయం తీసుకుని అభిమానులకు షాకిచ్చింది. ఇంతకీ ఆమె ఎవరో తెలుసా..? ప్రస్తుత డిజిటల్ యుగంలో సెలబ్రిటీలు తమ అభిమానులకు నిరంతరం అందుబాటులో ఉండేందుకు సోషల్ మీడియాను ప్రధాన వేదికగా చేసుకుంటున్నారు. అయితే, నిరంతర ఆన్‌లైన్ ప్రెజెన్స్ కారణంగా ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించడానికి కొంతమంది తారలు డిజిటల్ డిటాక్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. తాజాగా ఈ జాబితాలోకి చేరారు ప్రముఖ నటి కాయదు లోహర్. 'డ్రాగన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులను అలరించిన ఆమె, తాజాగా సోషల్ మీడియాకు తాత్కాలిక విరామం ప్రకటిస్తున్నట్లు సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. జీవితంలో రోజూ ఎదుర్కొనే మానసిక ఒత్తిడి నుండి ఉపశమనం పొందడానికి, అలాగే ప్రశాంతత కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు కాయదు తెలిపారు. ఈ విషయమై ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక ప్రత్యేకమైన పోస్ట్‌ను పంచుకున్నారు. "సోషల్ మీడియా నుంచి చిన్న విరామం తీసుకుంటున్నాను. సాధారణంగా మనం అలసిపోయినప్పుడు శరీరానికి విశ్రాంతి ఇస్తాం, అదే విధంగా మన మనసుకూ విశ్రాంతి అవసరం. అందుకే స్క్రీన్‌కు, డిజిటల్ ప్రపంచానికి కొంతకాలం దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాను. నాతో నేను ఎక్కువ సమయం గడపాలని అనుకుంటున్నాను" అని కాయదు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా తనకు ఎల్లప్పుడూ మద్దతుగా నిలిచిన అభిమానులకు, నెటిజన్లకు ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. "నాకు నిరంతరం మద్దతుగా నిలిచి, నన్ను ప్రోత్సహించి, ఎనలేని ప్రేమను చూపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మీ సందేశాలు, మీరు చూపించే ఆదరణ నాకు ఎంతో విలువైనవి. నేను వ్యక్తిగతంగా కొంతకాలం సోషల్ మీడియాకు దూరంగా ఉన్నప్పటికీ, నా సినిమాలకు సంబంధించిన ఏవైనా ముఖ్యమైన అధికారిక అప్‌డేట్స్ ఉంటే, నా టీమ్ ఈ అకౌంట్ ద్వారా వాటిని షేర్ చేస్తుంది. త్వరలోనే మళ్లీ కలుద్దాం" అని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. కాయదు లోహర్ ప్రస్తుతం వైవిధ్యమైన ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆమె జీవీ ప్రకాష్ హీరోగా, మరియప్పన్ చిన్నా దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ఇమ్మోర్టల్' అనే హారర్ థ్రిల్లర్ చిత్రంలో నటిస్తున్నారు. ఈ విరామం తర్వాత ఆమె మరింత ఉత్సాహంతో, సరికొత్త సినిమాలతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. మరోవైపు తెలుగులోనూ వరుస అవకాశాలు అందుకుంటున్నారు. అలాగే తమిళంలో ప్రైవట్ సాంగ్స్ చేస్తూ అలరిస్తున్నారు. సోషల్ మీడియాలో చాలా యాక్టివ్ గా ఉండే ఈ ముద్దుగుమ్మ.. ఇప్పుడు బ్రేక్ తీసుకోవడం గమనార్హమే. కన్నడ, మలయాళం, తెలుగు, తమిళ భాషా చిత్రాలలో నటిస్తూ మంచి ఫాలోయింగ్ క్రియేట్ చేసుకున్నారు. కయాదు లోహర్ తన కెరీర్‌ను మోడలింగ్‌తో ప్రారంభించారు. 'ఎవరీయూత్ ఫ్రెష్ ఫేస్ (సీజన్ 12)' పోటీలలో విజేతగా నిలిచిన తర్వాత ఆమెకు సినిమా అవకాశాలు వచ్చాయి. 2021లో వచ్చిన కన్నడ చిత్రం 'ముగిల్‌పేటే' ద్వారా ఆమె వెండితెరకు పరిచయమయ్యారు. 2022లో శ్రీవిష్ణు కథానాయకుడిగా వచ్చిన పోలీస్ యాక్షన్ డ్రామా 'అల్లూరి' చిత్రం ద్వారా ఆమె టాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు.

# మాట నిలబెట్టుకున్న బండ్ల గణేష్.. పవన్ అభిమాని నిరంజన్‌కు ఆర్థిక సాయం



టాలీవుడ్ ప్రముఖ నిర్మాత, నటుడు బండ్ల గణేష్ మరోసారి తన గొప్ప మనసునుకు చాటుకున్నారు. రెండు మూడు రోజుల క్రితం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ చిన్నారి నిరంజన్ కు తన వంతు ఆర్థిక సాయం చేశారు. శనివారం (జూన్ 20) వరంగల్ వచ్చిన బండ్లన్న బాబును పరామర్శించి ధైర్యం చెప్పారు. కొద్ది రోజుల క్రితం ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిరంజన్ అనే తన చిన్నారి అభిమానిని స్వయంగా వచ్చి కలిసిన సంగతి తెలిసిందే.పిల్లాడికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం చేస్తానని ఇది వరకే ప్రకటించారు. ఇప్పుడు ఆ మాటను నిలబెట్టుకున్నారు బండ్లన్న. శనివారం (జూన్ 20) హనుమకొండ హనుమాన్ నగర్‌లోని నిరంజన్ నివాసానికి వెళ్లిన బండ్ల గణేశ్, చిన్నారితో చాలా సేపు ముచ్చటించారు. నేను పవన్ కల్యాణ్ గారి భక్తుడిని. ఆయన వచ్చి పరామర్శించినప్పుడే నిరంజన్ స్ఫూర్తితోనే. పవన్ కల్యాణ్ స్ఫూర్తితోనే నేను ఈ రోజు ఇక్కడికి వచ్చి ఆర్థిక సాయం చేశాను.

# చరిత్ర సృష్టించిన రోహిత్..

### ద్రవిడ్, గంగూలీ రికార్డులు బ్రేక్.. కోహ్లీ, సచిన్ సరసన హిట్‌మ్యాన్!




వయసు కేవలం అంకె మాత్రమే అని రోహిత్ శర్మ మరోసారి నిరూపించాడు. కెప్టెన్‌గా జట్టును ముందుండి నడిపించడమే కాకుండా, దిగ్గజాల రికార్డులను తిరగరాస్తూ సరికొత్త రికార్డుల రారాజుగా నిలిచాడు. ఈ అద్భుత ప్రదర్శనతో హిట్ మ్యాన్ మరోసారి భారత క్రికెట్ అభిమానుల గుండెల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నాడు. చెన్నై వేదికగా ఆఫ్ఘనిస్తాన్‌తో జరిగిన ఆఖరి వన్డేలో భారత కెప్టెన్ రోహిత్ శర్మ సరికొత్త చరిత్ర లిఖించాడు. అద్భుత అర్ధశతకంతో చెలరేగిన హిట్ మ్యాన్.. టీమిండియా దిగ్గజాలు రాహుల్ ద్రవిడ్, సౌరవ్ గంగూలీల ఆల్‌టైమ్ రికార్డులను అధిగమించాడు. వన్డే క్రికెట్‌లో అత్యధిక హాఫ్ సెంచరీలు చేసిన మూడో భారతీయ బ్యాటర్‌గా నిలిచి అభిమానులను ఉర్రూతలూగించాడు.

**చెన్నై వేదికగా రోహిత్ శర్మ విశ్వరూపం..**

చెన్నైలోని ప్రసిద్ధ ఎంఏ చిదంబరం స్టేడియంలో ఆఫ్ఘనిస్తాన్‌తో జరుగుతున్న మూడో వన్డే మ్యాచ్ సరికొత్త రికార్డులకు వేదికైంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్‌ను భారత బౌలర్లు 218 పరుగులకే కట్టడి చేశారు. అనంతరం 219 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత జట్టుకు ఓపెనర్లు రోహిత్ శర్మ, యశస్వి జైస్వాల్ అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. తొలి ఓవర్ నుంచే ఆఫ్ఘన్ బౌలర్లపై విరుచుకుపడుతూ మ్యాచ్‌ను పూర్తిగా భారత్ వైపు తిప్పేశారు. ఫీల్డర్లు ఇచ్చిన కొన్ని సులువైన క్యాచ్‌లను ఆఫ్ఘన్ ఆటగాళ్లు వదిలేయడంతో దొరికిన అవకాశాలను రోహిత్ శర్మ పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడు. మైదానం నలుమూలలా క్లాసిక్ షాట్లతో అలరిస్తూ కేవలం 139 బంతుల్లోనే 170 పరుగుల భారీ ఓపెనింగ్ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు.

**ద్రవిడ్, గంగూలీ రికార్డులు బద్దలు.. సచిన్, కోహ్లీ సరసన హిట్ మ్యాన్..**

ఈ అద్భుత ఇన్నింగ్స్ ఆడే క్రమంలో రోహిత్ శర్మ వన్డే క్రికెట్‌లో అత్యంత అరుదైన మైలురాయిని అందుకున్నాడు. వన్డేల్లో రోహిత్‌కు ఇది 95వ యాభై ప్లస్ (50ం) స్కోరు. దీనితో ఇప్పటివరకు 94 సార్లు ఈ ఘనత సాధించిన రాహుల్ ద్రవిడ్‌ను, 93 సార్లు సాధించిన సౌరవ్ గంగూలీని రోహిత్ అధిగమించాడు. ప్రస్తుతం భారత్ తరపున వన్డేల్లో అత్యధిక 50 ప్లస్ స్కోర్లు చేసిన బ్యాటర్ల జాబితాలో రోహిత్ శర్మ మూడో స్థానానికి చేరుకున్నాడు. ఇప్పుడు రోహిత్ కంటే ముందు క్రికెట్ దేవుడు సచిన్ టెండూల్కర్ (145 స్కోర్లు), రన్ మెషిన్ విరాట్ కోహ్లీ (131 స్కోర్లు) మాత్రమే ఉన్నారు.

భారత్ తరపున వన్డేల్లో అత్యధిక 50ం స్కోర్లు చేసిన వీరులు: సచిన్ టెండూల్కర్ – 145, విరాట్ కోహ్లీ – 131, రోహిత్ శర్మ – 95, రాహుల్ ద్రవిడ్ – 94, సౌరవ్ గంగూలీ – 93

**39 ఏళ్ల వయసులో నయా రికార్డు..**

ఈ మ్యాచ్ ద్వారా రోహిత్ శర్మ మరో అద్భుతమైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. 39 ఏళ్ల 51 రోజుల వయసులో అర్ధశతకం సాధించిన రోహిత్.. వన్డే క్రికెట్ చరిత్రలో హాఫ్ సెంచరీ చేసిన అత్యంత వృద్ధ భారతీయ ఆటగాడిగా నిలిచాడు. 1989లో పాకిస్తాన్‌పై 39 ఏళ్ల 21 రోజుల వయసులో హాఫ్ సెంచరీ చేసిన మోహిందర్ అమర్‌నాథ్ పేరిట ఉన్న సుదీర్ఘ రికార్డును రోహిత్ ఈరోజు తిరగరాశాడు.

**ఫీల్డింగ్‌లోనూ అరుదైన రికార్డు: ప్రసిద్ధ్ కృష్ణతో కలిసి మ్యాజిక్..**

ఈ మ్యాచ్‌లో రోహిత్ కేవలం బ్యాటింగ్‌తోనే కాకుండా ఫీల్డింగ్‌తోనూ సంచలనం సృష్టించాడు. టీమిండియా యువ ఫాస్ట్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ వేసిన అద్భుతమైన బంతులకు ఆఫ్ఘనిస్తాన్ టాప్ ఆర్డర్ కుప్పకూలింది. ఇన్నింగ్స్ ప్రారంభంలో పడిన మొదటి మూడు వికెట్లకు రోహిత్ శర్మ అద్భుతమైన క్యాచ్‌లు అందుకున్నాడు. వన్డే క్రికెట్ చరిత్రలో ఒకే ఇన్నింగ్స్‌లో మొదటి మూడు వికెట్లను బౌలర్-ఫీల్డర్ కాంబినేషన్‌లో పడగొట్టడం ఇది కేవలం నాలుగోసారి మాత్రమే కావడం విశేషం.

**ఆఫ్ఘన్ కెప్టెన్ షాహిది పోరాటం..**

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఆఫ్ఘనిస్తాన్ జట్టును వారి కెప్టెన్ హష్మతుల్లా షాహిది ఒంటరి పోరాటంతో ఆదుకున్నాడు. కెరీర్‌లో మొట్టమొదటి వన్డే సెంచరీ (102 పరుగులు) సాధించి జట్టుకు గౌరవప్రదమైన స్కోరును అందించాడు. అతనికి తోడుగా అజ్మతుల్లా ఒమర్జాయ్ (50 పరుగులు) అర్ధశతకంతో రాణించడంతో, ఆఫ్ఘనిస్తాన్ జట్టు 44.2 ఓవర్లలో 218 పరుగులకు ఆలౌట్ అయింది.

# ఆఫ్ఘాన్‌పై హ్యాట్రిక్ విక్టరీ..

### వన్డే సిరీస్ కైవసం చేసుకున్న టీమిండియా..



చెన్నై వేదికగా జరిగిన మూడో వన్డేలో భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ అద్భుత శతకంతో చెలరేగాడు. కెప్టెన్ రోహిత్ శర్మతో కలిసి ప్రత్యర్థి బౌలర్లను ఊచకోత కోస్తూ భారత్‌కు 9 వికెట్ల తేడాతో భారీ విజయాన్ని అందించాడు. ఈ విజయంతో టీమిండియా సొంతగడ్డపై మరో చిరస్మరణీయమైన సిరీస్ విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఆఫ్ఘనిస్తాన్ నిర్దేశించిన లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన భారత జట్టుకు ఓపెనర్లు అదిరిపోయే ఆరంభాన్ని ఇచ్చారు. ముఖ్యంగా యువ సంచలనం యశస్వి జైస్వాల్ మైదానం నలుమూలలా బౌండరీల వర్షం కురిపించాడు. కేవలం 86 బంతులు ఎదుర్కొన్న జైస్వాల్ 14 ఫోర్లు, 3 భారీ సిక్సర్ల సాయంతో 110 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. వన్డే క్రికెట్‌లో తన మార్కు క్లాస్, మాస్ షాట్లతో ఆఫ్ఘన్ బౌలింగ్ విభాగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేస్తూ అజేయ శతకంతో జట్టును విజయతీరాలకు చేర్చాడు.

**అండగా నిలిచిన కెప్టెన్ రోహిత్ శర్మ**

మరోవైపు కెప్టెన్ రోహిత్ శర్మ కూడా తనదైన శైలిలో విరుచుకుపడ్డాడు. జైస్వాల్‌కు అండగా నిలుస్తూనే స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. రోహిత్ శర్మ 69 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 79 పరుగుల అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. వీరిద్దరి మధ్య నమోదైన భారీ భాగస్వామ్యంతో భారత్ విజయం ఎప్పుడో ఖాయమైపోయింది. అయితే సెంచరీ వైపు దూసుకెళ్తున్న రోహిత్.. మహమ్మద్ నబి బౌలింగ్‌లో ప్రత్యామ్నాయ ఫీల్డర్ సెదిఖుల్లా అటల్ చేతికి చిక్కి అవుటయ్యాడు. దాంతో భారత్ తొలి వికెట్‌ను కోల్పోయింది.

**కేవలం 28.4 ఓవర్లలోనే మ్యాచ్ క్లోజ్..**

రోహిత్ అవుటైన తర్వాత క్రీజులోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్ ఏమాత్రం ఒత్తిడికి లోనవకుండా వేగంగా ఆడాడు. అయ్యర్ 19 బంతుల్లో 2 సిక్సర్ల సాయంతో 20 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. భారత్ కేవలం 28.4 ఓవర్లలోనే 1 వికెట్ నష్టానికి 224 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. ఆఫ్ఘన్ బౌలర్లలో మహమ్మద్ నబికి మాత్రమే ఒక వికెట్ దక్కింది. మిగతా బౌలర్లు ఎవరూ కూడా భారత బ్యాటర్లను అడ్డుకోలేకపోయారు. చెన్నైలోని చిదంబరం స్టేడియంలో భారత బ్యాటర్లు ఆడిన ఇన్నింగ్స్ అభిమానులకు కంటినిండా విందును ఇచ్చింది. యశస్వి జైస్వాల్ బాధ్యతాయుతమైన శతకం, రోహిత్ శర్మ అనుభవజ్ఞుడైన ఆటతీరు జట్టుకు తిరుగులేని విజయాన్ని తెచ్చిపెట్టాయి. రాబోయే పర్యటనలకు ముందు యువ ఆటగాళ్లు ఇలాంటి ఫామ్‌ను ప్రదర్శించడం భారత క్రికెట్‌కు ఎంతో సానుకూలాంశం.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com